
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

బుధవారం 21 మే 2025 | 5

మినీ మహానాడు పండుగ

ఇదీ టీడీపీ అంటే.. వానొచ్చినా లెక్కచేయరు.. పార్టీయే ముఖ్యమంటారు.. ఒక్క పిలుపు ఇస్తే వచ్చి వాలిపోతారు.. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు.. జిల్లాలోని కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో మంగళవారం మినీ మహానాడు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు హాజరైన నాయకులు, కార్యకర్తలు జై టీడీపీ... జై జై టీడీపీ నినాదాలతో హోరెత్తించారు..



కొవ్వూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆంధ్ర షుగర్స్ జేఎండీ అచ్యుతబాబు తదితరులు

మహానాడులో మనోళ్లు!

- నిర్వహణ కమిటీలో నేతలకు ప్రాధాన్యం
- తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా యనమల



యనమల రామకృష్ణుడు

మంత్రి వాసంశెట్టి సుభాష్

రాజమహేంద్రవరం/అమలాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : అధికార తెలుగుదేశం పార్టీ ఈనెల 27, 28, 29వ తేదీల్లో కడపలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మహానాడుకు సంబంధించిన కమిటీల్లో ఉమ్మడి జిల్లా వారిలో పలువురికి చోటుదక్కింది. మొత్తం 19 కమిటీలను నియమించగా, రెండు కమిటీలకు కన్వీనర్లను ఉమ్మడి జిల్లా నేతలకు అప్పగించడం గమనార్హం. పలు కమిటీల్లో పలువురు ఎమ్మెల్యేలు, నేతలకు ప్రాధాన్యత లభించింది. మాజీ ఆర్థికమంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. సభా స్థలంలో సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ కన్వీనర్‌గా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియమితులయ్యారు. భోజనాల కమిటీ కోకన్వీనర్‌గా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) నియమితులయ్యారు. రవాణా కమిటీ సభ్యుడిగా గోపాలపురం ఎమ్మెల్యే, బడ్జెట్ ఎస్టిమేట్స్ కమిటీ సభ్యుడు మద్దిపాటి వెంకట్రాజు నియమితులయ్యారు. సభా ప్రాంగణం పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌కు స్థానం దక్కింది. అలాగే సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ సభ్యుడిగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ సాధికారిక సమితి కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు, జన సమీకరణ కమిటీ సభ్యుడిగా అమలాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ సభ్యుడు అయితాబత్తుల ఆనందరావును నియమించారు.



చిరు జల్లులు : కాకినాడ నగరంలో కురుస్తున్న వాన

కాకినాడలో ఇలా...

రాజమండ్రిలో..

వానా వరణం!

ఎండా పోయి.. వాన వచ్చే ఢాం ఢాం

- ఉదయం నుంచి వదలని వాన
- వరుణుడి దెబ్బకు భానుడు పరార్
- కాకినాడ జలమయం
- కరపలో అత్యధిక వర్షపాతం
- నేడు, రేపు కూడా వానలు
- ఊపిరిపీల్చుకున్న జనం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఒక పక్క తీవ్ర ఎండలు.. భరించలేని వేడి.. ఉక్కబోతతో అల్లాడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు మంగళవారం కురిసిన భారీ వర్షాలు ఉపశమనం కలిగించాయి. తెల్లవారుజాము నుంచీ రోజంతా అనేకచోట్ల ఓ మోస్తరు నుంచి కుండపోతగా వానపడడంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. గడచిన కొన్ని వారాలుగా ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. కాకపోతే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టి సాయంత్రానికి చినుకులు పడుతున్నాయి. దీంతో రోజులో సగం ప్రజలు వేడి, ఉక్కబోతతో నరకం చూస్తున్నారు. అయితే సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా వాతావరణం మారింది.అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వాన కురిసింది. కొన్నిచోట్ల అయితే మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వానలు పడ్డాయి. దీంతో రోజంతా ఎండమాయమై చల్లని వాతావరణం కొనసాగడంతో జనం ఉపశమనం పొందారు. కాకినాడ నగరంలో భారీ వర్షం పడడంతో మెయిన్ రోడ్డు, మసీదుసెంటర్, లోతట్టు ప్రాంతాలన్నీ మోకాల్లోతు నీటిలో మునిగాయి.అనేక ఇళ్లల్లోకి సైతం నీరు వచ్చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కాకినాడ నగరంలో ఏకంగా 7.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కరప మండలంలో ఏకధాటిగా వానపడడంతో రాష్ట్రంలోనే అత్యధికంగా 6.5 సె.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షం ధాటికి అనేక రహదారులు మునిగాయి. పంటచేలల్లోకి నీరు వచ్చి చేరింది. కాకినాడ రూరల్‌లో 5.5 సెం.మీ. నమోదైంది. కోనసీమ జిల్లాలోని మండపేటలో అతి తక్కువ వ్యవధిలో 4.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాకినాడ జిల్లా పెదపూడిలో 5, కాజులూరు మండలం ఆర్యవటంలో 4.8, పిఠాపురం, తాళ్లరేవు, రౌతులపూడిలో 2, కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 4.4, కపిలేశ్వరపురంలో 3.6, ఆలమూరు 2.1, ఆత్రేయపురం 1.2, తూర్పుగోదావరి జిల్లా కడియంలో 2, బిక్కవోలు 1.8, అనపర్తి 1.7 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. మరోపక్క రుతు పవనాల ప్రభావంతో బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో నేడు, రేపు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



అబ్బబ్బా ఇదేమి వాన : కరపలో నీట మునిగిన ఎంపీడీవో కార్యాలయం



ఈ వాహనాలకు ఇక పనిలేదు..

రేషన్.. ఎండీయూ వద్దు!

ఇకపై ఎప్పుడు కావాలంటే అప్పుడే రేషన్

- ఇక అక్రమాలకు బ్రేక్
- ఎండీయూ వాహన సేవలు రద్దు
- క్యాబినెట్‌లో నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 1,139 వినియోగం
- రూ.66.19 కోట్లతో కొనుగోలు
- ఇంకా 20 నెలల రుణం బాకీ
- 2,857 దుకాణాల్లో రేషన్

(కాకినాడ/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎండీయూ వాహన సేవలకు ప్రభుత్వం మంగళం పాడేసింది.పేదలకు బియ్యం పంపిణీ పేరుతో నాలుగున్నరేళ్ల వైసీపీ సేవలో తరించిన వాహనాలు ఇకపై రద్ద య్యాయి. ఇన్నేళ్ల కొనసాగుతున్న దందాకు ప్రభుత్వం చెక్ పెట్టింది. రేషన్ బియ్యం ఇకపై రేషన్ దుకాణాల్లోనే తెచ్చుకునే వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ మంగళవారం నిర్ణయం ప్రకటించింది.

1 నుంచి దుకాణాల వద్దే..

లబ్ధిదారులకు బియ్యం, నిత్యావసరాలు అందించేందుకు గతంలో ఉండే చౌక డిపోల వ్యవస్థను జూన్ 1వ తేదీ నుంచి తిరిగి పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇకపై కార్డుదారులు నేరుగా తమ పరిధి లోని రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకోవచ్చని తెలిపింది. కాకినాడ జిల్లాలో 1,060 రేషన్ దుకాణాల్లో 6.43 లక్షల మంది కార్డుదారులు రేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. కోనసీమ జిల్లాలో 926 రేషన్ దుకాణాల్లో 5.38 లక్షల మంది కార్డుదారులు, తూర్పుగోదావరి జిల్లాలో 871 దుకాణాల ద్వారా 5.65 లక్షల మంది కార్డుదారులకు ప్రభుత్వం నెలకు ఉమ్మడి జిల్లాలో 26 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేయనుంది. ఇకపై 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఏ సమయంలోనైనా లబ్ధిదారుడు చౌక దుకాణం వద్దకు వెళ్లి నేరుగా బియ్యంతో సహా ఇతర నిత్యావసర వస్తువులు పొందే అవకాశం ఉంది. దీనికితోడు దివ్యాంగులు, వృద్ధులకు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం వినూత్న చర్యలు చేపట్టనుంది. కాగా రాష్ట్రవ్యాప్తంగా చౌకడిపో డీలర్లు చేస్తున్న ఉద్యమాల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలకు బ్రేక్ వేశారు..

నెలలో తమకు కావాల్సిన సమయంలో కార్డుదారులు రేషన్‌దుకాణానికి వెళ్లి తెచ్చుకునే అవకాశం అమలవుతుండగా..గత వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచింది. కార్డుదారులకు నరకం చూపించింది. తొలుత ఇంటింటికి బియ్యం పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆనక మాట మార్చేసింది. ఒక కాలనీకి వెళ్లి ఈ ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనం సైరన్‌తో ప్రదర్శిస్తే గంటల తరబడి ఆ కాలనీ వాసులు వాహనం ఎదుట నిలబడి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితికి తెచ్చింది. ఆ రోజు వాహనం వద్దకు వెళ్లకపోతే ఆ నెల బియ్యం పోయినట్టే.ఈ వాహనం పేరుతో సదరు ఆపరేటర్లు కార్డుదారులపై రుబాబు చేసేవారు. బియ్యం ఇచ్చినట్టే ఇచ్చి అక్కడే తిరిగి కొనుగోలు చేసేవారు.ఆ బియ్యం తిరిగి వైసీపీ నేతల కనుసన్నల్లో నడిచే రేషన్ మాఫియాకు ఈ వాహనాలు తరలించేవి.ఇదే విషయాన్ని మంగళవారం నాటి క్యాబినెట్ సమావేశంలో మంత్రులు ప్రస్తావించారు.దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ ఎం డీయూ వాహనాలను రద్దు చేసింది.

కోట్లలో దుర్వినియోగం..

గత వైసీపీ ప్రభుత్వం సొంత ప్రచారానికి రేషన్‌దుకాణాలను నిర్వీర్యం చేసి ఈ ఎండీయూ వాహనాలను రుద్దింది. ఒక్కో వాహనాన్ని రూ.5.81 లక్షల చొప్పున బ్యాంకు రుణంపై కొనుగోలు చేసి ఆపరేటర్లకు అందించింది. మొత్తం 72 నెలల వాయిదాపై బ్యాంకు నుంచి 2021 ఫిబ్రవరిలో రుణం తీసుకుంది.కాకినాడ జిల్లాలో 420, తూర్పుగోదావరి జిల్లాలో 364, కోనసీమ జిల్లాలో 355 వాహనాలను బ్యాంకు నుంచి రూ.66.19 కోట్ల రుణం ద్వారా కొనుగోలు చేసింది.ఇప్పటికీ ఈ రుణాన్ని ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తోంది.ఇంకా ఇరవై నెలల బాకీ బ్యాంకుల్లో ఉంది. ఇప్పుడు ఈ వాహనాలను రద్దు చేసిన నేపథ్యంలో రూ.6.83 కోట్లు అప్పు తీర్చాల్సి ఉంది. ఈ ఎండీయూ వాహనాలను నడుపుతున్న వ్యక్తుల ఉపాధికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం వారికి ఆ వాహనాలను ఉచితంగానే అప్పగించడం ద్వారా ఎండీయూ వాహనాల నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవనేది ప్రభుత్వం ఆలోచనగా ఉంది.

ఆంధ్రజ్యోతి కథనం.. ఎంపీడీవో తొలగింపు

ఇన్‌చార్జి ఎండీవోగా ఆర్మ్‌స్ట్రాంగ్

రాజమహేంద్రవరం రూరల్ మే 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక వచ్చింది..ఎంపీడీవో స్థాయి అధికారిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు పంచాయతీల సీఎఫ్ఎంఎస్ బిల్లుల విషయంలో అనధికారికంగా వ్యవహరించినట్టు ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు విచారణకు ఆదేశించిన కలెక్టర్ నిజమని తేలడంతో శ్రీనివాసరావును విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలో ఈయన విధులు అవసరం లేదంటూ కమిషనర్ పీఆర్ఆర్డీకి తదుపరి చర్యల నిమిత్తం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూరల్ మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా కె.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను నియమిస్తూ కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు.

డబ్బులకు బెదిరిస్తే సమాచారం ఇవ్వండి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్స్, స్కానింగ్ సెంటర్లకు మీనాక్షి అనే పేరుతో 70326 72067 మొబైల్ నెంబరు నుంచి కాల్ చేసి ప్రభుత్వ అధికారిగా తనను పరిచయం చేసుకుని, డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు బెదిరిస్తున్నట్టు తమ కార్యాలయానికి సమాచారం అందిందని అలాంటి కాల్స్‌తో తమ కార్యాలయానికి ఎలాంటి సంబంధంలేదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనధికార బెదిరింపు కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత, ఆర్థిక, ఇన్‌స్టిట్యూషన్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. నకిలీ కాల్స్ వస్తే వెంటనే డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం సెల్ 8125567830 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వం మారింది.. తెలుగుకు వెలుగొచ్చింది.. రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. నోటిఫికేషన్ జారీకి ఆమోదం తెలిపింది. రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గోదావరి ప్రజల కోరిక తీరింది.



తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ప్రధాన ద్వారం

తెలుగు..వెలుగు!

- పొట్టి శ్రీరాములు తెలుగు వర్శిటీకి ప్రాణం
- సీఎం చొరవతో కేబినెట్ ఆమోదం
- రాజమండ్రిలో ప్రధాన కార్యాలయం
- 1986లో పీఠానికి ఎన్టీఆర్ శంకుస్థాపన
- గోదావరి జిల్లాల్లో హర్షాతిరేకాలు
- రాష్ట్ర విభజన తర్వాత తొలి వర్శిటీ
- 55 ఎకరాలు ఇస్తే మిగిలింది 20 ఎకరాలే

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉనికి కోల్పోయింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విశ్వవిద్యాలయం పేరు మార్పుతోపాటు, ఏపీలోని తెలుగు వర్శిటీకి సంబంధించిన మూడు పీఠాల నిర్వహణ అధ్వానమైంది. 2016 వరకూ ఇక్కడ అన్ని కోర్సులు జరిగాయి. బొమ్మూరులోని తెలుగు పీఠంలో 2024- 25 నుంచి మొత్తం అడ్మిషన్లు ఆగిపోయాయి. ఈ నెల 3వ తేదీన ఎంఎ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తవడంతో ఈపీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది.దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి, తెలుగు కళలకు పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం చిగురించింది. ఇక్కడ ఉద్యోగులకు జీతాలు రాని పరిస్థితి ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఓఎస్‌డీని నియమించి జీతాలు ఇస్తున్నారు.

1986లో ఆరంభించిన ఎన్‌టీఆర్..

తెలుగు సాంస్కృతిక, సాహిత్య వైభవం విరజిల్లిన ప్రాంతం రాజమహేంద్రవరం..ఈ నేపథ్యంలో 1986 ఏప్రిల్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టీఆర్ తెలుగు భాషను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయంలో భాగంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటుకు స్వయంగా శంకుస్థాపన చేశారు.శ్రీశైలం, కూచిపూడిలలో కూడా తెలుగు విశ్వవిద్యాలయ పీఠాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరంలో బొమ్మూరు కొండ మీద సుమారు 55 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. అడ్మినిస్ట్రేషన్ భవనం, తరగతుల నిర్వహణ, హాస్టల్, హాస్టల్ మెస్, నాలుగు క్వార్టర్స్ నిర్మించారు. బొమ్మూరు తెలుగు పీఠం ఓ వెలుగు వెలిగింది. విభజన నేపథ్యంలో పీఠం శిథిలస్థితికి చేరింది. క్యాబినెట్ నిర్ణయంతో మళ్లీ జీవం పోసుకుని ఇక్కడ తెలుగు విశ్వవిద్యాలయంగా విరాజిల్లనుంది. తొలి పీఠాధిపతిగా కొత్తపల్లి వీరభద్రరావు నియమితులయ్యారు. ఎండ్లూరి సుధాకర్ హయాంలో రాష్ట్ర విభజన రావడంతో ఇది పూర్తిగా దెబ్బతింది. ఇక్కడ తెలుగు ఎంఎ,ఎంఫిల్, పీహెచ్‌డీ తరగతులు నిర్వహించేవారు. మొదట తరగతికి 25 మంది విద్యార్థులతో ఇది మొదలైంది. తర్వాత 30కి పెరిగింది. ఆరుగురు టీచింగ్ స్టాఫ్, 12 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఉండేవారు. ఇక్కడ ప్రముఖ ప్రవచనకారుడు గరికిపాటి నరసింహారావు మొదటి ఎంఫిల్ పట్టాపొందారు.ప్రముఖకవి అద్దేపల్లి రామ్మోహనరావు, విమర్శకుడు ద్వానాశాస్త్రి ఇక్కడ పీహెచ్‌డీ చేశారు. మారిషస్ దేశం నుంచి వచ్చి ఇద్దరు ఇక్కడ పీహెచ్‌డీలు చేశారు.ఇక్కడ 300 మంది పీహెచ్‌డీలు చేయగా, సుమారు 450 మంది ఎంఫిల్ చేశారు. సుమారు 550 మంది తెలుగు ఎంఎ చేశారు. కాలువ మల్లయ్య వంటి ప్రముఖ కథా రచయితలు ఇక్కడ గోష్ఠుల్లో పాల్గొనడం గమనార్హం. ఇక్కడ 14 మంది ఉద్యోగులు మాత్రం ఉన్నారు. భవనాలు సుమారుగా శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల భూమి మిగిలింది. 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం ఉంది.



చిట్టడవిలా ప్రధాన భవనం ఆవరణ

కేబినెట్‌లో ఏం జరిగిందంటే..

అమరావతిలో మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చట్టం 1985 లోని సెక్షన్ 3(2) ప్రకారం రాజమహేంద్రవరంలో ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఏపీలో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు ప్రారంభానికి వీలు కల్పించింది. ఏపీలో ఉన్న మూడు సాహిత్య పీఠాలను నిర్వహణకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుందని కేబినెట్ విశదీకరించింది. రాజమహేంద్రవరంలో తెలుగు వర్శిటీ ఏర్పాటుపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.



చెట్లతో మూసుకుపోయిన ప్రధాన రహదారి



కొవ్వూరు రేషన్ డిపో వద్ద లబ్ధిదారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్

రేషన్ పంపిణీపై నిఘా ఉండాలి

రేషన్ దుకాణాల పరిశీలనలో కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపంపిణీ వ్యవస్థ పనితీరును క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.చాగల్లు ఎంఎల్ఎస్ పాయింటుతో పాటు కొవ్వూరులోని రేషన్ దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. చాగల్లు మండలం ఊనగట్ల స్టాక్ పాయింటులో స్టాక్‌ను, రిజిష్టర్ల నిర్వహణ పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తున్న పౌరసేవలకు సంబంధించి ఆయా వ్యవస్థల పనితీరుపై జిల్లాస్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఊనగట్ల స్టాక్ పాయింటు పరిశీలించి నివేదిక అందించాలని ఆర్డీవోను ఆదేశించారు. కొవ్వూరులో రేషన్ షాపుల వద్ద వినియోగదారులతో మాట్లాడారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తనిఖీచేసిన స్టాక్ వివరాలను తెలిపారు.వారి వెంట తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సీఎస్‌డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యోగాంధ్రప్రదేశ్

రాజమహేంద్రవరం సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లో బుధవారం ఉదయం 6 గంటలకు యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంపై మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డీవోలు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, పురపాలక కమిషనర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వన్ నేషన్- వన్ హెల్త్ నినాదంతో ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగాపై పోటీలు నిర్వహించాలని సూచించారు.జూన్ 21న విశాఖలో జరిగే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారన్నారు.సమావేశంలో జేసీ చిన్నరాముడు ,డీఆర్‌వో సీతారామమూర్తి పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని మంగళవారం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కుటుంబంతో మర్యాదపూర్వకంగా కలిశారు. - కొవ్వూరు


కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ సాగర తీరం

తీరాన... అందాల హరివిల్లు!

కాకినాడ టు కోనసీమ చుట్టొచ్చేద్దామా

పర్యాటకులకు ఇదొక చక్కని అనుభూతుల లోగిలి



అటు సముద్రం.. ఇటు గోదావరి. ఆ అంచున కడలి కెరటాలు.. వేటకెళ్లే బోట్లు.. ఈ అంచు గట్టున ప్రకృతిలో ఓలాలాడే చిరుగాలులు.. గోదారి పరవళ్లు. ఎటువెళ్లినా నీళ్లే.. అందాల హరివిల్లు చూడాలంటే ఇటు కాకినాడ వైపు.. అటు కోనసీమ వైపు వెళితే చాలు. ఒక్కోచోట ఒక్కో అందం.. ప్రకృతి సోయగాల మధ్య సేదతీరాలనుకునే వారికి ఇంతకంటే గొప్ప అనుభూతినిచ్చే ప్రదేశాలు ఉండవేమో. పర్యాటకులను ఉల్లాసపరిచే, వారికి ఆహ్లాదాన్ని పంచే, ఆధ్యాత్మిక అనుభూతిని మిగిల్చే ఆ లోకంలోకి వెళదాం రండి.. కాకినాడ జిల్లాలో పర్యటించాలనుకునే వారికి అతి ముఖ్యమైన వాటిలో అన్నవరం ఆలయ సందర్శన ఒకటి. అక్కడ నుంచి ఉప్పాడ సముద్ర తీరం, కాకినాడ బీచ్, కోరంగి మడ అడవులు చూసేశాక... మధ్య పుదుచ్చేరి రాష్ట్రంలో భాగమైన యానాం బీచ్‌లో అలా విహరించేసి కోనసీమ అందాలను చూసుకుంటూ ఓడలరేవును దాటుకుని దిండి రిసార్ట్స్‌లో బసచేసి, అక్కడి నుంచి అంతర్వేది ఆలయాన్ని, అక్కడి సముద్ర తీరాన్ని చుట్టేసి వస్తే.. కొన్నేళ్ల పాటు ఆ అనుభూతులు మనల్ని వెంటాడతాయని వేరే చెప్పాలా.. ఆ విశేషాలు ఇవిగో...


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం దిండిలో గోదావరి నదిలో బోటుపై విహారం

పర్యాటకులను కట్టిపడేస్తున్న

కోనసీమ అందాలు

దిండిలో నదీపాయలపై అలరిస్తున్న హౌస్‌బోట్లు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందచందాలకు కేరాఫ్ అడ్రస్ కోనసీమ. కేరళ తరహా అందాలను సొంతం చేసుకున్న ఈ ప్రాంతంలో ఏమారుమూల పల్లెకు వెళ్లినా ఆప్యాయతా అనురాగాలతో పల్లకరించే జనం. మర్యాదలతో ముంచెత్తే మనుషులు కనిపి స్తారు. కనువిందు చేసే ఎన్నో సముద్ర, గోదావరి నదీ తీర ప్రాంతాలతో పాటు ప్రకృతి రమణీయతను రంగరించే రీతిలో పచ్చని చేల చెంతన గలగల పారే సెలయేరు కాల్వల మధ్య సాదరంగా స్వాగతం పలికే కొబ్బరిచెట్ల సమూహాలమధ్య పయనించే ఏ పర్యాటకుడైనా ఫిదా కావాల్సిందే.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నదీ తీరప్రాంతాలతో పాటు మడ అడవులు, చముదు క్షేత్రాలు, ప్రసిద్ధి చెందిన ఆలయాలు పర్యాటకులను కనువిందు చేస్తాయి. గలగల పారుతున్న గోదావరిలో పడవ ప్రయాణం పర్యాటకులకు ఓ మధురానుభూతిని మిగులుస్తుంది. వశిష్ట నది చెంతన మలికిపురం మండలం దిండిలో కేరళ తరహాలో ఉన్న హౌస్‌బోట్లు ద్వారా నదీ విహారాలు సాగిస్తుంటారు. దిండి రిసార్ట్స్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన వసతిగదులతో పాటు హౌస్ బోట్లు, వశిష్ట బోటు, స్పీడు బోట్లు ఉన్నాయి. గంటల వారీ ప్యాకేజీలు ఇక్కడ అమలు అవుతాయి. వైనతేయ నదీపాయ పేరున హౌస్‌బోటు ప్రత్యేక హంగులతో పర్యాటకులకు నదీ విహారం చేయనుంది. గోదావరి, వశిష్ట, ఆత్రేయ పేర్లతో బోట్లు నదీపాయల్లో పర్యాటకులతో విహరిస్తాయి. ముఖ్యంగా హౌస్ బోటులో నలుగురు పెద్దవారు, నలుగురు పిల్లలకు ప్యాకేజీ రూ.15వేలు. గోదావరి బోటులో 20 మంది, వశిష్ట బోటులో 20 మంది, ఆత్రేయలో పది మంది పర్యాటకులు ఉంటే నదీ విహారానికి బయల్దేరతాయి. వీటిని ఆన్‌లైన్ ద్వారా కూడా బుక్‌చేసుకోవచ్చు. ఈ బోట్ ప్యాకేజీ కోసం దిండి రిసార్ట్స్‌లోని సెల్ 9848780524 ద్వారా సంప్రదించవచ్చు. ప్రస్తుతం కోనసీమలో దిండి రిసార్ట్స్ వద్ద ఉన్న హౌస్ బోట్ల విహారానికి పర్యాటకులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. వీటితో పాటు యానాం నుంచి సావేరీ బోటు ద్వారా సాగర సంగమ విహారం, బోడసకుర్రు, పాశర్లపూడి, ఆదుర్రు, సోంపల్లి, అంతర్వేది, సఖినేటిపల్లి, ఎదుర్లంక, దిండితో పాటు వివిధ నదీ పరివాహక ప్రాంతాల్లో బోటు షికార్లను ప్రైవేటు సంస్థలు ఏర్పాటుచేశాయి. వీటితో పాటు కాట్రేనికోన మండలం కందికుప్ప, తాళ్లరేవు మండలం కోరంగి నుంచి మడ అడవుల్లో పడవల ద్వారా విహార యాత్ర సాగించడానికి అటవీ శాఖ ఏర్పాట్లు చేసింది.



కోనసీమలోని మలికిపురం మండలం దిండిలో టూరిజం రిసార్ట్స్‌తో పాటు సమీపంలో మరో మూడు ప్రైవేటు రిసార్ట్స్ ఉన్నాయి. సోంపల్లిలో కోనసీమ రిసార్ట్స్, ఓడలరేవులో సముద్ర రిసార్ట్స్, అయినవిల్లిలో విల్లా రిసార్ట్స్, పాశర్లపూడి, యానాం పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు రిసార్ట్స్ పర్యాటకులకు ఎంతో అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడ ఫుడ్ ప్యాకేజీలతో పాటు స్థానికంగా ఈ ప్రాంతంలో లభ్యమయ్యే ఎన్నో రకాల వంటకాలను పర్యాటకులు పసందైన విందుగాస్వీకరిస్తారు. వేసవి సీజను కావడంతో కోనసీమ జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు రిసార్ట్స్ పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

వన్యప్రాణుల అభయారణ్యం కోరింగ... భారతదేశంలోని రెండో అతి పెద్ద మడ అడవులు ఇక్కడ ఉన్నాయి. 35 రకాల మడచెట్లు, 120కి పైగా పక్షి జాతులు ఉన్నాయి. నీటి పిల్లి లేదా ఏటి పిల్లి అనే వన్య ప్రాణి ఇక్కడ ప్రత్యేకత. కాకినాడ జిల్లా ప్రధాన కేంద్రమైన కాకినాడ నగరం నుంచి 18 కిలోమీటర్ల దూరంలో కోరింగ ఉంది. తీరం నుంచి కాకినాడను కాపాడే సహజసిద్ధ కోటగా కోరంగిని పిలుస్తారు. కోరంగిలో 300 మీటర్ల పొడవైన చెక్క వంతెనపై నడిచి అభయారణ్యాన్ని వీక్షించడం మధురానుభూతి.


కోరింగ అభయారణ్యంలో చెక్కల వంతెన

కోరింగ అభయారణ్యం... మడ అడవులు


మడ అడవుల మధ్య కోరింగ అభయారణ్యం సొగసు చూడతరమా...

వాకలపూడి బీచ్...

కాకినాడ సాగర తీరం ప్రశాంతమైన వాతావరణంలో ఉంటుంది. నగరానికి సుమారు ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కాకినాడ నగరంతో పాటు సమీప గ్రామాల ప్రజలు, జిల్లాలోని ఇతర ప్రాంతాల వాసులు కాకినాడ సాగర తీరానికి వస్తారు. 15 కిలోమీటర్లు పొడవైన ఈ ప్రాంతం తెల్లటి అలలతో అలరిస్తుంది. ఆటపాటలతో సందడి చేస్తారు. వాకలపూడి బీచ్‌లో పర్యాటకులకు అవసరమైన ఎన్నో సౌకర్యాలను ఏర్పాటు చేశారు. బీచ్ పార్క్, ఎమ్యూజ్‌మెంట్ పార్కు, గోకార్ట్ రేసింగ్, పారాచ్యూట్ వంటి ఎన్నో ఉన్నాయి.



సముద్రం మధ్యలో హోప్ ఐలాండ్ కూడా సందర్శనీయ స్థలం. కాకినాడ సాగర తీరం నుంచి బోటుపై ఆ ప్రాంతానికి చేరుకోవచ్చు. అయితే పోర్టు అధికారులు, మెరైన్ పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలి.

భక్తులకు అన్న'వరం'

అన్నవరం కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం. కోరిన కోర్కెలు తీర్చే అన్నవరం సత్యదేవుడు రత్నగిరిపై కొలువై ఉన్నారు. వీరవెంకటసత్యనారాయణ స్వామి ఆలయం అత్యంత విలక్షణమైనది. పురాణాల ప్రకారం ఇక్కడ సత్యదేవునికి ప్రత్యేక వ్రతాలు నిర్వహిస్తుంటారు. వ్రతం చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయనేది భక్తుల నమ్మకం. విశాఖ జాతీయ రహదారిలో కాకినాడకు 50 కిలోమీటర్ల దూరంలో ఈ దేవస్థానం ఉంది. సందర్శనీయమైన ఎన్నో



పురాతన ప్రదేశాలు ఈ ఆలయ ఆవరణలో ఉన్నాయి. పంపా నదిలో విహారం కూడా చేసే అవకాశం ఉంది.



ఉప్పాడ తీరం...

పిఠాపురం నియోజకవర్గం కొత్తపల్లి మండలంలో ఉన్న ఉప్పాడ తీరం మంచి పర్యాటక ప్రాంతం. ఉవ్వెత్తున ఎగసి పడే అలలు ఇక్కడ ప్రత్యేకం. ఓ పక్క సముద్రతీరానికి సమీపంలోనే నివాస గృహాలతో అక్కడంతా వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. అంతేకాదు.. ఉప్పాడ చేనేత వస్త్రాలకు పుట్టినిల్లు. ఇక్కడ నేత నేసిన చీరలు దేశవ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందాయి. కాకినాడ నగరానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉప్పాడ తీర ప్రాంతం ఉంది. ఎన్నో సినిమాల్లో సన్నివేశాలను ఇక్కడే చిత్రీకరించారు.



యానాం బీచ్

కాకినాడకు సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రాంతం యానాం. పుదుచ్చేరి రాష్ట్ర పరిధిలోని ఈ పట్టణంలో ఓ పక్కన గోదావరి, మరోపక్క సముద్ర తీరం వుంటుంది. పర్యాటకులు సరదాగా గడిపేందుకు అనువైన ప్రాంతం. అంతేకాదు ఇక్కడ మద్యం ధరలు తక్కువ కావడంతో ఎక్కడెక్కడి నుంచో మందుబాబులు వచ్చి ఎంజాయ్ చేస్తారు. ఆంధ్రాకన్నా ఇక్కడ పెట్రోల్ ధరలు కూడా తక్కువే.

శివసదన్ కాటేజీకి రూ.10 లక్షలు విరాళం

అన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సత్యగిరి కొండపై నిర్మిస్తున్న శివ సదన్ కాటేజీకి మంగళవారం ఏలూరుకు చెందిన బుద్ధిరాజు లలితసుందరి, విశాఖపట్నానికి చెందిన కిండెపూడి వరలక్ష్మి సంయుక్తంగా రూ.10లక్షలు విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని దాతలు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామకృష్ణకు అందజేయగా ఆయన దాతలను అభినందించారు. కార్యక్రమంలో డ్రాఫ్ట్‌మెన్ సత్యప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రామకృష్ణకు విరాళం అందజేస్తున్న దాతలు

డాక్టర్ యనమదలకు 'తపన' సేవా పురస్కారం

వచ్చే నెల 22న సత్యసాయి జిల్లా హిందూపురంలో ప్రదానం

కార్పొరేషన్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య, విజ్ఞాన రచనల ద్వారా ప్రజారోగ్య రంగంలో విశేష కృషి చేస్తున్న కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యుడు యనమదల మురళీ కృష్ణకు సత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన తపన సాహిత్య వేదిక సేవా పురస్కారం ప్రకటించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొవిడ్, ఎయిడ్స్‌పైన, ఇటీవలి కాలంలో పెరిగిపోతున్న గుండెజబ్బులపైన తన రచనల ద్వారా ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మురళీకృష్ణను ఈ ఏడాది సేవా పురస్కారానికి ఎంపిక చేసినట్టు తపన సాహిత్య వేదిక వ్యవస్థాపకుడు, ప్రముఖ మాండలిక రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి తెలిపారు. డాక్టర్



మురళీకృష్ణ 2000లో ఎయిడ్స్‌పై, 2022లో కొవిడ్ ఎయిడ్స్ నేను, 2024 మే నెలలో హెచ్ఐవీ ఎయిడ్స్, జూన్ నెలలో హెచ్ఐవీ ఎయిడ్స్ ఇన్ ఇండియా అండ్ డెవలపింగ్ కంట్రీస్ పుస్తకాలను వెలువరించారు. ఈయన దాదాపు అన్ని ప్రధాన పత్రికలు, సామాజిక, ప్రసార మాధ్యమాల్లో ఆరోగ్య విశేషాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేశారు. కొవిడ్ సమయంలో ఈయన వ్యాసాలు, ఇంటర్వ్యూలు ప్రజలకు కొండంత భరోసానిచ్చాయి. రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, గంటేడ గౌరునాయుడు, డాక్టర్ దేవేంద్ర అవార్డుల ఎంపికలో న్యాయనిర్ణేతలుగా వున్నారు. జూన్ 22న హిందూపురంలో అవార్డు ప్రదానం చేస్తామని చిదంబరరెడ్డి చెప్పారు.

రెండో రోజుకు ఏపీఈఏపీసెట్

జేఎన్టీయూకే, మే20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏపీఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు రెండో రోజు కూడా కొనసాగాయి. మంగళవారం నిర్వహించిన అగ్రికల్చర్,ఫార్మసీ పరీక్ష కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగినట్టు కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు. రెండు సెషన్లలో మూడు జిల్లాల్లోని 9 కేంద్రాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5వరకు నిర్వహించారు.

● కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో

● ముగిసిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు

ఉదయం నిర్వహించిన పరీక్షకు 918 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 856 మంది హాజరుకాగా 62మంది గైర్హాజరయ్యారన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 920మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 862 మంది హాజరు కాగా 58 మంది పరీక్ష రాయలేదని తెలిపారు.

● తూర్పుగోదావరి జిల్లాలోని రెండు పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 1,285 మంది విద్యార్థులు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,183 మంది హాజరు కాగా 102 మంది గైర్హాజరు కాగా 92.06 శాతం హాజరు నమోదైందన్నారు.

● అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 798 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 751 మంది హాజరుకాగా 47 మంది రాయలేదని, మొత్తం 94.11 శాతం హాజరయ్యారన్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షల ప్రాథమిక కీని బుధవారం విడుదల చేస్తామన్నారు. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలు బుధవారం ప్రారంభమై ఈ నెల 27 వరకు కొనసాగుతాయని తెలిపారు.

నేటి నుంచి జాతీయ స్థాయి నాటిక పోటీలు

అనపర్తి, మే 20(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరంలోని నల్లమిల్లి మూలారెడ్డి కళాపరిషత్ 36వ జాతీయస్థాయి ఆహ్వాన సాంఘిక నాటిక పోటీలు బుధవారం ప్రారంభంకానున్నాయి. స్థానిక నల్లమిల్లి సుబ్బిరెడ్డి స్మారక కళామందిరంలో నాలుగురోజులపాటు జరిగే పోటీలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పరిషత్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. 21న జనరల్‌బోగీలు, కిడ్నాప్, 22న(అ)సత్యం, నాన్న నేనొచ్చేస్తా, 23న విడాకులు కావాలి, కొత్త పరిమళం, నిశ్శబ్దమా నీ ఖరీదెంత, 24న చిగురుమేఘం నాటికలను ప్రదర్శిస్తారు.

పిఠాపురంలో తిరంగా యాత్ర

త్రివిధ దళాలకు సెల్యూట్ చేస్తున్నాం: వర్మ

పిఠాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంలో త్రివిధ దళాలు చూపిన తెగువ, స్ఫూర్తికి సెల్యూట్ చేస్తూ కాకినాడ జిల్లా పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తిరంగా యాత్ర నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల మీదుగా జాతీయ జెండాలతో ప్రదర్శన జరిపి సైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


తిరంగా యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వర్మ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కాశీకి 73వేల మట్టి శివలింగాలు

బిక్కవోలు, మే 20 (ఆంధ్రజ్యోతి): 73వేల మట్టి శివలింగాలు తయారు చేయించి కాశీకి పంపుతున్నట్టు బలభద్రపురానికి చెందిన కొవ్వూరి రామారెడ్డి (హిందీ మాస్టారు) భార్య అచ్చియ్యమ్మ మంగళవారం తెలిపారు. కొంకుదురు శివాలయంలో తయారుచేస్తున్న శివలింగాలను చూసి అక్కడి వారిని సంప్రదించగా తమకు మట్టి పంపారని... తనతో పాటు వంద మంది మహిళలు భక్తిశ్రద్ధలతో వీటిని నెలా పదిహేను రోజులు శ్రమించి తయారు చేశామని చెప్పారు.


బలభద్రపురంలో తయారు చేసిన మట్టి శివలింగాలు


కాకినాడ కలెక్టరేట్ ఎదుట వంట-వార్పు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

సీహెచ్‌వోల వంట-వార్పు

● కాకినాడ కలెక్టరేట్ ఎదుట వినూత్న నిరసన

కలెక్టరేట్ (కాకినాడ),మే 20 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌వో) మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టరేట్ ఎదుట వినూత్నంగా నిరసన తెలిపారు. వంట-వార్పు ద్వారా ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేశారు. ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ మాట్లాడుతూ జాతీయ ఆరోగ్యమిషన్ ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతనాలు వర్తింపజేయాలన్నారు. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. ఈపీఎఫ్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట జాబ్‌చార్టర్ ఇవ్వాలని,


భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

ఇంక్రిమెంట్లు, హెచ్ఆర్ పాలసీ అమలుచేయాలని, జీతాల బకాయిలను త్వరితగతిన చెల్లించాలని నినదించారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తర్వాత కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. రఘు, వరకాంత్, నానాజీ, అనిల్, ప్రసన్న పాల్గొన్నారు.

తదుపరి చిత్రం రామ్‌చరణ్‌తోనే..

ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్



మలికిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): తన తదుపరి చిత్రం రామ్‌చరణ్‌తో ఉంటుందని ప్రముఖ సినీ దర్శకుడు బండ్రెడ్డి సుకుమార్ తెలిపారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం మట్టపర్రు వచ్చిన ఆయన విలేకర్లతో ముచ్చటించారు. ఈ మధ్య సినిమాలకు గ్యాప్ ఎక్కువ వచ్చిందని అడగ్గా నవ్వి ఊరుకున్నారు. పుష్ప-2 చిత్రం ద్వారా జాతీయ స్థాయిలో తనకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సినిమాలను థియేటర్లలో, టీవీల్లో వీక్షిస్తున్నారని, పట్టణాల్లో యాప్‌లతో మమేకమవుతున్నారని తెలిపారు. తాను మొదటిగా పేపర్ చూసేటప్పుడు స్పోర్ట్స్, సినిమాలు, తరువాత రాజకీయాలు చదువుతానన్నారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సుకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.కాసేపు మాట్లాడారు.



మలికిపురం మండలం మట్టపర్రులో ఓ బాలుడికి ఆటోగ్రాఫ్ ఇస్తున్న సుకుమార్

సిద్ధివినాయకుని హుండీల ఆదాయం రూ.27.68 లక్షలు



అయినవిల్లి సిద్ధివినాయక ఆలయంలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

అయినవిల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామి హుండీలను మంగళవారం లెక్కించారు. 61 రోజులకు ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.26,86,790, అన్నప్రసాదం ద్వారా రూ.81,491 వెరసి మొత్తం రూ.27,68,281 నగదుతో పాటు 4.4 గ్రాముల బంగారం, 436 గ్రాముల వెండి, 30 విదేశీ కరెన్సీ నోట్లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పర్యవేక్షణాధికారి జంపా రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో హుండీల లెక్కింపు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకస్వాములు, గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోకోనట్ పార్కు, సీపీసీఎస్‌ల ఏర్పాటుపై అధ్యయనం

ఐదుగురు సభ్యులతో అధికారుల బృందం

కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో పర్యటన



మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్‌ఐ డైరెక్టర్ శ్రీదేవి అన్నపూర్ణను కలిసిన కోనసీమ జిల్లా అధికారుల బృందం

అమలాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి ఆధారిత పరిశ్రమల స్థాపనతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోకోనట్ కామన్ ఫెసిలిటీ సెంటర్లు (సీపీసీఎస్) ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేపట్టింది. దీనిలో భాగంగా సాంకేతిక సరఫరా, వీటి స్థాపనకు అవసరమైన స్థలాలు మార్కెటింగ్ లింకేజెస్ వంటి అంశాలపై అధ్యయనం చేసేందుకు అధికారుల బృందం ఇతర రాష్ట్రాలకు వెళ్లింది. ఐదు రోజుల పాటు ఈ బృందం మైసూర్, కాసర్గోడ్, కొచ్చిన్, కోయంబత్తూర్‌లో పర్యటించనుంది. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచనలతో ఈ బృందాన్ని ఏర్పాటు చేశారు. దీనికి జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ టి.ప్రసాద్ నాయకత్వం వహిస్తున్నారు. పీడీడీఆర్‌డీఏ జైచంద్ర గాంధీ, జిల్లా ఉద్యానశాఖాధికారి బీవీ రమణ, ఏపీ ఐసీసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, ఎల్డీఎం వర్మ తదితరులు ఉన్నారు. దీనిలో భాగంగా మైసూర్‌లోని కేంద్రీయ ఆహార పరిశోధనా సంస్థ (సీఎఫ్‌టీఆర్‌ఐ)ను సందర్శించారు. డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవిఅన్నపూర్ణతో పాటు ఇతర శాస్త్రవేత్తలతో సమావేశమై కొబ్బరి, అరటి వంటి తోట పంటల విలువ జోడింపు, ఉత్పత్తులపై పరిశోధన, ప్యాకేజింగ్, ఎగుమతులు వంటి అంశాలపై చర్చించారు. మంగళవారం కాసర్గోడ్‌లోని కేంద్రీయ తోట పంటల పరిశోధనాసంస్థ (సీపీటీఆర్‌ఐ)ను సందర్శించిన బృందం శాస్త్రవేత్తలతో మాట్లాడారు. రోగనిరోధకత కలిగిన కొబ్బరి రకాలు, కోనసీమ వాతావరణానికి అనుకూల వంగడాలపై అక్కడ శాస్త్రవేత్తలతో సమగ్రంగా చర్చించారు. ఈ నెల 21న కొచ్చిన్‌లోని కొబ్బరి అభివృద్ధి బోర్డు (కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు)ను సందర్శించనున్నారు. కొబ్బరి ఫైబర్ ప్రోసెసింగ్, కొబ్బరి ఉత్పత్తిని బ్రాండెడ్ ఉత్పత్తిగా తయారుచేయడం, క్వాయర్ పరిశ్రమలకు అవసరమైన యంత్ర పరికరాలను సేకరించనున్నారు. 22న కొచ్చిన చుట్టుపక్కల పరిసరాల్లో పర్యటిస్తారు. 23న తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూర్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రైవేటు కొబ్బరి పరిశ్రమల స్థాపన, వాటి నిర్వహణ, మార్కెటింగ్ అంశాల వంటి వాటిపై చర్చించనున్నారు. పర్యటన అనంతరం అధికారుల బృందం కలెక్టర్‌కు కోనసీమ జిల్లాలో కొబ్బరి ఉత్పత్తులు, ఫెసిలిటీ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి అధ్యయన నివేదికను సమర్పించనున్నారు.

సామర్లకోట-కాకినాడ రోడ్డులో వాహనాల రాకపోకలు యథాతథం

కాకినాడ జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), మే 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట నుంచి అచ్చంపేట వరకు భారత్‌మాల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బ్రిడ్జిలకు గడ్డర్లు లేపే కార్యక్రమాలను వర్షాల వల్ల తాత్కాలికంగా వాయిదా వేశామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామర్లకోట నుంచి కాకినాడ మార్గంలో ముత్యాలమ్మ గుడి వద్ద ఓవర్ బ్రిడ్జి గడ్డర్ల పనుల నిమిత్తం నాలుగు రోజులు ట్రాఫిక్ మళ్లించాలని తొలుత నిర్ణయించామని, వర్షాల కారణంగా వాయిదా వేశామన్నారు. దీంతో సామర్లకోట- కాకినాడ కెనాల్ రోడ్డులో వాహనాల రాకపోకలు యథావిధిగా సాగుతాయని, ఈ మార్పును వాహనచోదకులు గమనించాలని కోరారు.

పాస్టర్ ప్రవీణ్ సంస్మరణ సభకు అనుమతివ్వాలి

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభకు అనుమతివ్వకపోతే క్రైస్తవ సంఘాలు ఎక్కడికక్కడ ఆందోళనకు దిగుతాయని అమలాపురం మాజీ ఎంపీ జీవీ.హర్షకుమార్ పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 24న కొంతమూరు సమీపంలోని ప్రకృతి వనం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికే సభ అనుమతికి కోరగా పోలీసులు మాత్రం స్పందించలేదన్నారు. సంస్మరణ సభకు అనుమతిస్తే ఎవరి మనోభావాలకు భంగం కలగకుండా, రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకుండ సభను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

బాలిక ఫిర్యాదుతో నలుగురిపై పోక్సో కేసు

మలికిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): తనను మోసం చేశాడని యువకుడిపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం పోలీసుస్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ యువకుడితో పాటు మరో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పీవీవీ.సురేష్ తెలిపారు. మలికిపురం మండలంలో బంధువుల ఇంటికి వచ్చిన ఏలూరుకు చెందిన ఎం.రాకేష్, 2023లో బాలికతో ప్రేమ వ్యవహారం నడిపి హైదరాబాద్‌కు వెళ్లి సహజీవనం చేశారు. వీరి మధ్య విభేదాలు రావడంతో పెద్ద మధ్య రాజీ ప్రయత్నం కుదరలేదు. దీంతో బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద యువకుడితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీ

అక్కడికక్కడే వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మృతిచెందిన చైతన్య జనార్దన

కొత్తపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): రెండు మోటార్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందినట్టు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కమ్మిరెడ్డిపాలానికి చెందిన ఓడా చైతన్యజనార్దన (36) రావులపాలెంలో పని నిమిత్తం సోమవారం కొత్తపేట నుంచి రాత్రి 11 సమయంలో మోటార్‌సైకిల్‌పై బయలుదేరి వెళ్లాడు. 1.45 సమయంలో కొత్తపేట తిరిగి వస్తుండగా మందపల్లి బ్రిడ్జి దాటిన తరువాత కల్యాణి సోంపాపిడి స్వీట్స్ షాపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా రావులపాలెం వెళ్తున్న మోటార్‌సైకిల్ ఎదురుగా ఢీకొనడంతో చైతన్యజనార్దన తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్‌ఐ తెలిపారు. దీనిపై అతడి భార్య ఓడా చిన్నారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా మరో మోటార్‌సైకిలిస్టుకు కూడా తీవ్రగాయాలు కాగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

24 గంటల్లో దొంగను పట్టేశారు

రూ.10 లక్షలు చోరీ

అన్నవరంలో నిందితుడి అరెస్ట్



అన్నవరంలో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు, సీఐ సూరిఅప్పారావు

అన్నవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): రూ.10 లక్షల చోరీ కేసులో నిందితుడిని 24 గంటల్లో పట్టుకుని బాధితుడికి నగదును అందజేశారు. వివరాల్లోకి వెళితే హైదరాబాద్‌కు చెందిన బోడపాటి నాగేశ్వరరావు సోమవారం కాకినాడ జిల్లా తునిలో ఉన్న తన స్థలం విక్రయించి అడ్వాన్స్ రూపంలో రూ.10 లక్షలు నగదు, మరో రూ.10 లక్షలు చెక్ ద్వారా తీసుకున్నాడు. నగదును బ్యాగ్‌లో పెట్టుకుని తుని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కి అన్నవరంలో దిగాడు. అయితే అతని దృష్టిమరల్చి బ్యాగ్ కత్తిరించి నగదుతో నిందితుడు ఉడాయించాడు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన నాగేశ్వరరావు అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా పెద్దాపురం డీఎస్పీ ఆదేశాలతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంకబాబు, ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావులు నాలుగు టీంలుగా విభజించి దర్యాప్తు చేపట్టగా అన్నవరం జాతీయ రహదారిపై మండపం సెంటర్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న విశాఖపట్నానికి చెందిన కంబాల శ్రీనును అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. నగదు తస్కరించుకున్నట్టు అంగీకరించడంతో అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ తెలిపారు. నిందితుడిని ప్రత్తిపాడు కోర్టులో ప్రవేశపెట్టినట్టు చెప్పారు. దొంతనం కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పెద్దాపురం సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అంకబాబు, ఏఎస్‌ఐ బలరాం, హెచ్‌సీ రాధాకృష్ణలను డీఎస్పీ అభినందించారు.

సముద్రంలో వేటకు వెళ్లి యువకుడి గల్లంతు

సురక్షితంగా బయటపడ్డ మరో ఇద్దరు



గల్లంతైన శ్యామ్ (ఫైల్‌ఫొటో)

కొత్తపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): సముద్రంపై వేట నిషేదం అమలులో ఉన్నా ముగ్గురు యువకులు బోటులో వేటకు బయలుదేరారు. వాతావరణం బాగోకపోవడంతో కెరటాలు ఉధృతంగా ఉండటంతో వారి బోటు కెరటాల ధాటికి తిరగబడింది. దీంతో ఒకరు గల్లంతవ్వగా ఇద్దరు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. మత్స్యశాఖ అభివృద్ధి అధికారి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్‌కాలనీకి చెందిన మత్స్యకార యువకులు మేరుగు శ్యామ్(19), వంకా ఇస్సాక్, రామిశెట్టి వీరబాబు సోమవారం అర్ధరాత్రి కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు చెందిన మత్స్యకారుడి బోటుపై చేపల వేటకు వెళ్లారు. డీప్ వాటర్‌పోర్టు, హోప్ ఐలాండ్ మధ్య చేపలు వేటాడే క్రమంలో కెరటాల ఉధృతికి బోటు తల్లకిందులవడంతో ముగ్గురు సముద్రంలో మునిగిపోయారు. ఇస్సాక్, వీరబాబు ఈదుకుంటూ దగ్గర్లో హోప్ ఐలాండ్‌కు సురక్షితంగా చేరుకున్నారు. శ్యామ్‌కు ఈత రాకపోవడంతో గల్లంతయ్యాడని సహచర మత్స్యకారులు సమాచారమిచ్చారు. దీంతో మంగళవారం ఉదయం 6బోట్లపై మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టినా శ్యామ్ జాడ తెలియలేదని రామకృష్ణ తెలిపారు.

ఉగ్రవాద కదలికలపై

ఉలిక్కిపడ్డ రంప మన్యం

రంప అడవుల్లో బాంబులు

పేల్చడంపై సర్వత్రా ఆందోళన

ఎన్‌ఐఏ విచారణలో అంశాలపై

విస్తుబోతున్న పోలీసువర్గాలు

రంపచోడవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద దాడులకు రిహార్సిల్స్‌గా రంప అడవులను ఎంచుకుని బాంబు పేలుళ్లను నిర్వహించిన అంశం రంప మన్యాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఇంతకాలం రంప అడవులు కేవలం మావోయిస్టు కార్యకలాపాలకే పరిమితమనుకుంటే ఇప్పుడు ఉగ్ర కార్యకలాపాల అమలు పరీక్షలకు కూడా ఏజెన్సీని వేదికగా చేసుకోవడం పోలీసువర్గాలను విస్తుబోయేలా చేస్తోంది. పాక్ ఉగ్రవాద వర్గాలకు సానుభూతిపరులుగా ఉన్న విజయనగరానికి చెందిన సిరాజ్ రెహ్మాన్, హైదరాబాద్‌కు చెందిన సమీర్‌లు ఉగ్రవాద చర్యలకు సహకరిస్తూ అందుకు కావాల్సిన పేలుడు పదార్థాలను సేకరించి వాటిని పరీక్షించేందుకు రంప అడవులను ఎంచుకున్నారని ఎన్‌ఐఏ వర్గాలు గుర్తించాయి. దీంతో అన్ని కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే వారు రంప అడవులను తమ పేలుళ్ల రిహార్సిల్స్ కోసం ఎంచుకోవడాన్ని గ్రహించారు. వీరు ఇక్కడకు ఎలా రాగలిగారు, ఇక్కడ ఎన్ని రోజులన్నారు, ఎక్కడెక్కడ తిరిగారు అన్న అనేక అంశాలను లోతుగా విచారించే దిశగా ఎన్‌ఐఏ బృందాలు పనిచేస్తున్నట్టు సమాచారం.

తల్లితో వివాహేతర సంబంధం.. కూతురితో పెళ్లి చేయాలని బెదిరింపు

● యువతిపై దాడి ● నిందితుడిపై కేసు



నిందితుడు నాగిరెడ్డి

అనపర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): తల్లితో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ ఆమె కుమార్తెపై కన్నేసి చంపుతానని బెదిరించాడో వ్యక్తి. అనపర్తి ఎస్‌ఐ శ్రీను నాయక్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన మహిళకు గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. వారికి ఇద్దరు అమ్మాయిలు సంతానం. 2016లో మహిళ భర్త చనిపోయాడు. భర్త చనిపోయిన 8 నెలలకు గ్రామానికి చెందిన పడాల నాగలక్ష్మీనారాయణ రెడ్డి అలియాస్ నాగిరెడ్డి పరిచయమయ్యాడు. అది కాస్తా సహజీవనంగా మారింది. ఆ మహిళ పెద్ద కుమార్తె పదో తరగతి చదివే సమయంలో తనకిచ్చి పెళ్లి చేయాలంటూ ఒత్తిడి తీసుకురావడంతో తల్లీ కూతుళ్లు నాగిరెడ్డిని ఇంటికి రాకుండా కట్టడి చేశారు. ఈ నేపథ్యంలో నాగిరెడ్డి మరో యువతిని వివాహం చేసుకున్నాడు. భార్యతో మనస్పర్థలు రావడంతో ఇటీవల విడిపోయారు. అనంతరం తిరిగి పాత మహిళ వద్దకు చేరుకున్న నాగిరెడ్డి బీటెక్ చదువుతున్న పెద్ద కుమార్తెపై కన్నేశాడు. ఈ క్రమంలో గత నెల 30న రాత్రి వారి ఇంటికి వెళ్లి వివాహ విషయంపై గొడవ పెట్టుకుని తల్లి కుమార్తెను చిత్రహింసలకు గురిచేశాడు. యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. పెళ్లి చేయకపోతే ముగ్గురిని చంపుతానని బెదిరించడంతో తట్టు కోలేకపోయిన బాధిత మహిళ 3రోజుల కిందట అనపర్తి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇరు కుటుంబాలను సోమవారం పోలీస్‌స్టేషన్‌కు రావాలని చెప్పడంతో వారు వచ్చారు. నాగిరెడ్డి తల్లి భానుమతి యువతిపై విరుచుకుపడి ఆమె పీక పట్టుకుని కింద పడేసి దాడికి పాల్పడింది. అపస్మారక స్థితికి చేరుకున్న యువతిని ఏరియా ఆసుపత్రికి తరలించడంతో చికిత్స అందించారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యం నిలకడగా ఉంది. తల్లీ కుమార్తెల ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సెర్ప్ సీసీ సూర్యనారాయణకు షోకాజ్ నోటీసులు

నిధుల దుర్వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యంపై చర్యలు

మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశం

పిఠాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై కాకినాడ జిల్లా పిఠాపురం మండలం సెర్ప్ సీసీ కమ్ ఆఫీస్ అసిస్టెంట్ జి.సూర్యనారాయణకు డీఆర్‌డీఏ-సెర్ప్ కాకినాడ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొత్తపల్లి మండలంలో సీసీగా పనిచేసిన సమయంలో ఫోర్జరీ సంతకాలతో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు, మహిళలను లైంగికంగా వేధించినట్టు సూర్యనారాయణపై ఆరోపణలొచ్చాయి. దీనిపై కొత్తపల్లి-2 వీవోఏ కె.గాయత్రి ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సెర్ప్ జిల్లా ప్రాజెక్టు మేనేజరు ఎంఎం జిలానీ విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. దీని ఆధారంగా 2023 నవంబరు 1న మంజూరైన స్త్రీ నిధిలోను రూ.3.50 లక్షలను, కొత్తపల్లి క్లస్టర్ సీసీ, ఆఫీసు అసిస్టెంట్‌గా పని చేసిన సమయంలో సూర్యనారాయణ ఫోర్జరీ సంతకాలతో నిధులు దుర్వినియోగం చేసినట్టు, 2023 మార్చి 24న మంజూరైన స్త్రీ నిధి రుణంలో ఒక సభ్యురాలికి రూ.75వేలకు కేవలం రూ.50వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని తీసుకున్నట్టు, హెచ్‌ఆర్ నిబంధనలకు విరుద్ధంగా మహిళలను లైంగికంగా వేధిస్తున్నట్టు విచారణ అధికారి తన నివేదికలో వివరించారు. వీటి ఆధారంగా క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సీసీ సూర్యనారాయణను డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు ఆదేశించారు. లేకుంటే తదుపరి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.



కాకినాడలో వర్షానికి చెరువును తలపిస్తున్న ఓ రహదారి



కాకినాడ నూకాలమ్మ గుడి రోడ్డులో వర్షం నీటిలో వెళ్తున్న వాహనాలు

వాన మయం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా మంగళవారం భారీ వర్షం కురిసింది. ఎండలకు అల్లాడుతున్న ప్రజలు వర్షంతో ఉపశమనం పొందారు. కొన్నిచోట్ల వర్షానికి దారులు చెరువుల్లా మారాయి.



భారీ వర్షానికి కాకినాడ జిల్లా కరప మండలం నడకుదురులో చెరువులా మారిన ప్రధాన రహదారి



రాజమహేంద్రవరంలో వర్షానికి తడవకుండా వాహనదారుల జాగ్రత్తలు





కోనసీమ జిల్లా మండపేటలో రహదారిపై వర్షం

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

యువతకు మరింత ఉపాధి కల్పించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి.. టీ హబ్ స్థాపనపై అధికారులతో క్షేత్రస్థాయి సమీక్ష



పాలిటెక్నిక్ కళాశాల ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో జిల్లా యువతకు మరింత ఉపాధి ఆవిష్కరణ, అవకాశాలు కల్పించేందుకు ఈ ప్రాంగణంలో ప్రాథమిక శిక్షణ తరగతులు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం బొమ్మూరులోని నైపుణ్యాభివృద్ధి కేంద్రం కార్యాలయం ఆవరణలో అధికారులతో కలిసి స్కిల్ డెవలప్మెంట్ కార్యాలయ భవనం పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో నూతన ఆవిష్కరణలకు దోహదం చేసే టీ హబ్‌ను రాజమహేంద్రవరం గ్రామీణ పరిధిలో జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గ్రాంట్‌తో టీ-హబ్ ఆధునిక సంస్థ స్థాపన సాధ్యాసాధ్యాలపై పాలిటెక్నిక్ కాలేజీ ఆవరణలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌కి కేటాయించిన స్థలాన్ని పరిశీలించినట్టు పేర్కొన్నారు. స్థల లభ్యత, సద్వినియోగం, భవిష్యత్తు అవసరాలకు అనుకూలతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిరుద్యోగ యువతకు స్టార్టప్‌లు, ఇన్నోవేషన్, టెక్నాలజీ రంగాల్లో మార్గదర్శకంగా నిలిచేలా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ గ్రాంటుతో భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు చక్కటి ప్రణాళిక తయారు చేయాలని ఏపీఈడబ్ల్యుఐడీసీ అసిస్టెంట్ ఇంజనీర్ శంకర్‌ను ఆదేశించారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలని, టి-హబ్ ద్వారా యువతలో నైపుణ్యాశిక్షణ, ప్రోత్సాహం అందించాలని తద్వారా ఆత్మవిశ్వాసం పెరిగి స్వయం ఉపాధి పొందుతారని కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ల్యాండ్ సర్వేయర్ ఏడీ బి.లక్ష్మీనారాయణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ, తహశీల్దార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవు

రేషన్ డీలర్లు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులతో సమావేశంలో జేసీ చిన్నరాముడు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

గోకవరం, మే 20(ఆంధ్రజ్యోతి): రేషన్ తూకాల్లో డీలర్లు మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు హెచ్చరించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో మంగళవారం ఆయన రేషన్ డీలర్లు, గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, రేషన్ సరఫరా వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్న ప్రతీ ఒక్కరూ రేషన్ కార్డులను స్వచ్ఛందంగా వదులుకునేందుకు ముందుకు రావాలన్నారు. దీనివల్ల అర్హులైన నిరుపేదలకు మరింత మెరుగైన లబ్ధి చేకూర్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. బియ్యం పంపిణీ సమయంలో వాహనదారులు లబ్ధిదారులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యానికి డబ్బులు వసూలు చేసినా, తూకాల్లో మోసాలకు పాల్పడినా, గ్యాస్ సరఫరాలో అధిక ధరలు తీసుకున్నా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాధవరాయుడుపాలెం సర్పంచ్‌కు

జీవ వైవిధ్య సంరక్షణ పురస్కారం



కడియం, మే 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే జీవ వైవిధ్య సంరక్షణ పురస్కారానికి మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి ఎంపికయ్యారు. ఈ నెల 22న విజయవాడలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోనున్నారు. చెట్ల సంరక్షణ, సేంద్రీయ వ్యవసాయం, సంస్కృతులు, సాంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాల్లో 25ఏళ్లుగా చంటి చేస్తున్న కృషికి ఏపీ జీవవైవిధ్య మండలి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. జీవ వైవిధ్య మండలి మెంబర్ సెక్రటరీ పి.రామకృష్ణ ఎంపిక పత్రాన్ని పంపించారని చంటి తెలిపారు. ఇదిలా ఉండగా 20 ఏళ్ల క్రిందట రోడ్డుకిరువైపులా చెట్లు నాటి వాటి సంరక్షణ, పురాతన మండువా లోగిలి పునః ప్రతిష్ఠ, గ్రామీణ జానపద కళలైన గారడీలు, గరగలు వాటిని ప్రోత్సహించడం, వరి కుచ్చులు కట్టించి పక్షిజాతులను కాపాడడం, సోలార్ యూనిట్ల ద్వారా విద్యుత్ ఉపయోగిస్తూ ప్రకృతి వనరుల సద్వినియోగం వంటి కృషికి గాను చంటి ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

కాలువ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

నీటి పారుదల శాఖాధికారులతో సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల



నీటి పారుదల శాఖాధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కర కాలువ మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సూచించారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో నీటి పారుదలశాఖ అధికారులతో సమీక్షించారు. దీనిలో భాగంగా రానున్న ఖరీఫ్ పంట సాగులో పుష్కర కాలువ ద్వారా నీటి విడుదలకు సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ పంట ప్రారంభం నాటికి సాగునీరు సక్రమంగా అందించేలా ఏర్పాట్లు చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలువ మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం నియోజకవర్గానికి మొత్తం 12 పనులు మంజూరయ్యాయని, వాటిని త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈలు రంగారావు, రాజేశ్వరరావు, డీఈఈలు నాగేంద్ర ప్రసాద్, పార్వతి, ఏఈలు విజయ్ భరత్, సాయికృష్ణ పాల్గొన్నారు.

పంట దిగుబడిలో విత్తన ఎంపిక కీలకం

ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ నరసింహారావు

దివాన్‌చెరువు, మే 20(ఆంధ్రజ్యోతి): రాబోయే సార్వా సీజన్‌లో పంట దిగుబడి బాగా రావాలంటే విత్తన ఎంపిక కీలకమని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లాకు అనువైన రకాల్లో ఎంటీయూ 7029 (స్వర్ణ) సాధారణ పరిస్థితులలో స్థిరమైన దిగుబడిని ఇస్తుందని తెలిపారు. అలాగే ఎంటీయూ 1318 (పడిపోని స్వర్ణ), పీఎల్ఏ1100, సన్నరకాలైన ఎంటీయూ 1224, ఎంటీయూ 1293 కూడా జిల్లాకు అనువైన వరి రకాలని చెప్పారు. ముఖ్యంగా రైతులు నమ్మకమైన డీలర్ల వద్ద నుంచి గాని రైతుల వద్ద నుంచి గాని విత్తనాలు సేకరించుకోవాలని సూచించారు. ఇక విత్తనాలు మొలక శాతం పరీక్షించుకోవడాన్ని వివరిస్తూ ప్లాస్టిక్ ట్రేలో మట్టి వేసి వాటిపై 100 నానబెట్టిన వరివిత్తనాలు వేయాలన్నారు. నాలుగైదు రోజుల్లో కోర వచ్చిన విత్తనాలు లెక్కింపు చేసి మొలకశాతం రైతుస్థాయిలోను కనుగొనవచ్చునని చెప్పారు. 80నుంచి 85శాతం విత్తనాలు మొలకెత్తితే చాలునని అన్నారు. రైతులు మంచి అవగాహనతో సరియైన యాజమాన్య చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించేందుకు వీలవుతుందని చెప్పారు. పరిశోధనా స్థానంలోని కొన్ని కొత్త రకాల వంగడాలను చిరు సంచుల రూపంలో త్వరలో రైతులకు అందజేస్తామని నరసింహారావు చెప్పారు.

రాజానగరంలో జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు



రాజానగరంలో కేక్ కట్ చేస్తున్న అభిమానులు

రాజానగరం, మే 20(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు నందమూరి తారక రామారావు (జూనియర్ ఎన్టీఆర్) పుట్టినరోజును రాజానగరంలోని నందమూరి యువసేన మంగళవారం రాత్రి నిర్వహించారు. స్థానిక ఫార్చ్యూన్ థియేటర్ వద్ద నందమూరి యువసేన గౌరవాధ్యక్షుడు కాళ్ల బుజ్జి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నందమూరి యువసేన మండలాధ్యక్షుడు పాతూరి నవీన్ చౌదరి, రామకృష్ణ, ప్రసాద్, కుర్రే శ్రీను, కొండపల్లి రాజు, అత్తిలి సుబ్బారావు, నాగేశ్వరరావు, డాన్ శ్రీను పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా మండలంలో పలు గ్రామాల్లో అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి కేక్‌లు కట్‌చేశారు. ఈ సందర్భంగా వడ్లూరు గ్రామ సర్పంచ్ ఆర్.తేజశ్రీ ఆధ్వర్యంలో పాలంగిలోని మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థుల వద్ద కేక్ కట్‌చేసి పిల్లలకు కేక్‌తోపాటు భోజనం అందజేశారు. కార్యక్రమంలో మానవత సేవా సంస్థ మండల అధ్యక్షుడు కేఎస్ రాజు, వడ్లూరు నాయకులు వేంద్ర రమేష్, పిల్లి మోహన్‌కృష్ణ, గొర్రెల శివరాం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

రాజానగరం, మే 20(ఆంధ్రజ్యోతి): హనుమద్ జయంతి సందర్భంగా రాజానగరంలోని రావులచెరువు గట్టున ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. తొలుత స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం, ప్రసాద వితరణ చేశారు.

రాజమహేంద్రిలో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

- త్వరలో అందుబాటులోకి..
- మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్
- ఐదు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- పనులు, క్రీడా సామగ్రి పరిశీలన



ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్

రాజమహేంద్రవరం సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రజలందరికీ ఆధునాతన మల్టీస్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్టు మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ అన్నారు. మంగళవారం రాజమహేంద్రవరం నారాయణపురంలోని గోదావరి పుష్కరాలు, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. క్రీడా సామగ్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరో ఐదురోజుల్లో పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. దాదాపు రూ4.30 కోట్ల వ్యయంతో సకల సదుపాయాలతో ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించుకుంటున్నామన్నారు. ఇందులో షూటింగ్, స్నూకర్(బిలియర్డ్స్), టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్‌తో పాటు లేటెస్ట్ ఎక్విప్‌మెంట్‌తో జిమ్ కూడా ఏర్పాటు చేసుకున్నట్టు కమిషనర్ చెప్పారు. నగరంలో ఉత్తమ క్రీడాకారులను తయారు చేసేందుకు కొత్తగా నిర్మించిన మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎంతగానో దోహద పడుతుందన్నారు. రాజమహేంద్రవరంలో క్రీడలకు అనువైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ముందుకువెళ్తున్నామన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంట కార్పొరేషన్ ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ రీటా, ఇతర సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా జరగాలి

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా జరగాలని అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో డ్రైనేజీల్లో ఎక్కడా నీరు నిలిచిపోకుండా పూడిక తొలగించాలని, ప్రతి రోజు ఇంటింటా చెత్తసేకరణ జరగాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను డంపింగ్‌యార్డుకు తరలించాలని, తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలన్నారు. ఉదయం 7గంటలకు ఇంటింటా చెత్తసేకరణ ప్రారంభం కావాలన్నారు. రోజూ పారిశుధ్య కార్మికులు ఎంతమంది విధులకు వస్తున్నదీ రికార్డులు ఉండాలన్నారు. రాత్రిపూట పనిచేసే సిబ్బంది రేడియం యాప్రాన్‌లు తప్పనిసరిగా ధరించాలన్నారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా కార్మికులకు రెయిన్ కోట్లు కూడా అందజేస్తామని అడిషనల్ కమిషనర్ అన్నారు. వీటితో పాటు తమ తమ పరిధిలో ఎన్ని అపార్టుమెంట్లు ఉన్నవి, వాటిలో హోం కంపోస్టింగ్ చేస్తున్న అపార్టుమెంట్లను గుర్తించాలన్నారు. దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్ డ్రైవ్‌ను ప్రతిరోజు నిర్వహించాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్ వైజర్లు, ఇన్స్‌పెక్టర్లు, బయాలజిస్టులు, సచివాయల సిబ్బంది, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో వాళ్లు చేసిన తప్పులు కూటమి చేయదని, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 39వ డివిజన్‌లో 36,38,39 డివిజన్లకు సంబంధించి రూ.1.50 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాల సమయంలో పల్లపు ప్రాంతాలు జలమయం కాకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వీరభద్రపురం, బోధి స్కూల్, కృష్ణానగర్, ఆదెమ్మదిబ్బ, లింగంపేట వాంబే గృహాలు, ఎన్ఆర్‌సీ లైనులో ఎక్కువగా నీటమునుగుతున్నాయని గుర్తించామన్నారు. వీరభద్రపురంలో డ్రైను నిర్మించడం వల్ల వర్షపు నీరు అరగంటలోనే లాగేసిందని, గతంలో ఇక్కడ 2గంటల పాటు నీరు నిలబడేదన్నారు. అక్కడ సరైన రీతిలో రోడ్డు నిర్మిస్తే నీరు డ్రైన్‌లోకి వెళ్లిపోతుందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు రూ.1.50కోట్లతో రోడ్డు లెవెల్ చేయడానికి పనులు చేపడుతున్నామన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్న వార్డులను వైసీపీ వాళ్లు నిర్లక్ష్యం చేశారని, ఆ తేడాలు తాము చూపించబోమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానాడు మీడియా కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే వాసు

సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ సభ్యుడిగా 'కుడుపూడి' నియామకం

కడపలో ఈనెల 27,28,29 తేదీల్లో జరిగే టీడీపీ మహానాడుకు సంబంధించిన కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. ఇందులో మీడియా కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును నియమించారు. అలాగే మహానాడు సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ సభ్యుడిగా శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబును నియమించారు. తమ నియామకాలపై ఎమ్మెల్యే వాసు, కుడుపూడి సత్తిబాబు ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్రాధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావులకు ధన్యవాదాలు తెలిపారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు ఘన నివాళి



టంగుటూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద స్వాతంత్ర్య సమర యోధుల పార్కులో మంగళవారం ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో ప్రకాశం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమితి అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి సీపీ రెడ్డి మాట్లాడుతూ ప్రకాశం పరిపాలనా దక్షతను, నాయకత్వ లక్షణాలను నేటి యువతకు దగ్గర చేయాలన్నారు. 2014లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించినట్టుగా రాజమండ్రి విమానాశ్రయానికి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పేరు పెట్టాలని కోరారు. సమితి తరపున ఈ మేరకు ప్రజాప్రతినిధులకు, నాయకులకు వినతిపత్రాలు సమర్పించాలని అన్నారు. కార్యక్రమంలో దేశిరెడ్డి బలరామ నాయుడు, దుర్వాసుల సత్యనారాయణ, గుడిపూడి సునీల్‌గౌతమ్ పాల్గొన్నారు. ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు, ఆంధ్ర కేసరి యువజన సమితి వ్యవస్థాపకుడు వైఎస్ నరసింహారావుల వర్ధంతుల సందర్భంగా వారి విగ్రహాలకు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ జి.రమణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం పంతులు రాజమహేంద్రవరం పురపాలక సంఘ చైర్మన్‌గా, మొట్ట మొదటి ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగాను, న్యాయవాదిగాను, బహుముఖ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ సర్వేశ్వరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

రైలులో తప్పిపోయిన బాలిక

సాంకేతికతతో గుర్తించిన జీఆర్పీ

రాజమహేంద్రవరం, మే 20(ఆంధ్రజ్యోతి): రైలులో ఓ బాలిక తప్పిపోగా ప్రభుత్వ రైల్వే పోలీసులు సాంకేతికతను ఉపయోగించి గంటల వ్యవధిలో ఆచూకీ కనిపెట్టారు. జీఆర్పీ ఎస్ఐ మావుళ్లు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలానికి చెందిన ఓ బాలిక(17) తల్లి, బంధువులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. తండ్రి మరణించాడనే సమాచారంతో తల్లి, బంధువులతో కలిసి స్వస్థలానికి ఈ నెల 19న విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరింది. 20న తెల్లవారుజామున నిడదవోలు సమీపంలో రైలు ఉండగా వాష్‌రూంకి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబీకులు అన్నవరం వెళ్లే వరకూ వెతికి ఫలితం లేకపోవడంతో 20న ఉదయం 11గంటల సమయంలో రాజమండ్రి జీఆర్పీ పోలీస్ స్టేషనుకు వచ్చి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. ఆ బాలిక ఆమె అక్కకు ఫోన్ చేయడంతో టవర్ లొకేషన్ ఆధారంగా వేరొక రైలులో ఉన్నట్లు గుర్తించారు. ఆమెను సాయంత్రం సురక్షితంగా కుటుంబీలకులకు అప్పగించడంతో.. వారు జీఆర్పీ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాగి వైరు చోరీపై ఫిర్యాదు

బిక్కవోలు, మే 20(ఆంధ్రజ్యోతి): తన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు పగులగొట్టి రాగి వైరు చోరీ చేయడంతో పందలపాక గ్రామానికి చెందిన పడాల సూర్యనారాయణరెడ్డి విద్యుత్‌శాఖ ఏఈ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 16వ తేదీ ఉదయం సూర్యనారాయణరెడ్డి తన పొలానికి వెళ్లగా ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి అందులో రాగి వైరు చోరీ గురికావడం గమనించి ట్రాన్స్‌కో ఏఈకి ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదును మంగళవారం తమకు అందజేశారని, దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు.

స్తంభించిన జన జీవనం

మంగళవారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం



బిక్కవోలులో కురుస్తున్న వర్షం

అనపర్తి/బిక్కవోలు, మే 20(ఆంధ్రజ్యోతి): అనపర్తి, బిక్కవోలు మండలాల్లో మంగళవారం తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో జన జీవనం స్తంభించింది. కొన్ని చోట్ల డ్రైన్లు పొంగడంతో రోడ్లు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం వల్ల ఉదయం పనులకు వెళ్లే వారు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు నానా అవస్థలు పడ్డారు. అనపర్తిలో పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉంచిన ట్రాక్టరుపై వేప చెట్టు కుప్ప కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వర్షం ప్రభావంతో విద్యుత్ సరఫరాలో ఆటంకాలు ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వేసవి తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలు మంగళవారం వర్షం కురవడంతో సేదదీరారు.



అనపర్తిలో పంచాయతీ ట్రాక్టర్‌పై కూలిన వేప చెట్టు

జిల్లాలో 150.2 మి.మీ వర్షపాతం నమోదు

బిక్కవోలులో అత్యధికంగా 42.4 మి.మీ.. సీతానగరంలో అత్యల్పంగా 2.0 మి.మీ

రాజమహేంద్రవరం సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో మంగళవారం 150.2 మీమీ వర్షపాతం నమోదయ్యింది. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం చినుకు చినుకుగా కురుస్తూనే వుంది. అత్యధికంగా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో బిక్కవోలులో 42.4 మి.మీ వర్షం కురిసింది. అత్యల్పంగా సీతానగరంలో 2.0 మి.మీ వర్షం పడింది. ఉండ్రాజవరంలో 20.6 మి.మీ, అనపర్తి 16.4 మి.మీ, పెరవలి 13.4 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్‌లో 9.6 మి.మీ, నిడదవోలులో 8.0 మి.మీ, రాజానగరంలో 5.2 మి.మీ, రంగంపేటలో 4.8 మి.మీ, కడియంలో 4.4 మి.మీ,రాజమహేంద్రవరంలో 4.4 మి.మీ, తాళ్లపూడిలో 3.8 మి.మీ, కోరుకొండలో 3.4 మి.మీ,కొవ్వూరులో 3.4మి.మీ, గోకవరంలో 3.2 మి.మీ, చాగల్లులో 2.6 మి.మీ, గోపాలపురంలో 2.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

బాతురూమ్‌లో జారి పడి

వృద్ధుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): బాతురూమ్‌లో జారి పడి వృద్ధుడు మృతి చెందాడు. రాజమహేంద్రవరం దానవాయిపేటకు ఐ.వీర్రాజు(82) ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. సోమవారం తన ఇంట్లోని బాత్ రూమ్‌లో కాలు జారి ప్రమాదవశాత్తూ కింద పడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి మేనల్లుడు గోవిందరాజు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపవరం సెక్రటరీకి

ఎమ్మెల్యే నల్లమిల్లి పరామర్శ

బిక్కవోలు, మే 20(ఆంధ్రజ్యోతి): కాపవరం వైసీపీ సర్పంచ్ సత్యంశెట్టి వెంకటరమణ వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పంచాయితీ సెక్రటరీ కె.విజయలక్ష్మిని రాజమహేంద్రవరం హుకుంపేటలోని ఆమె స్వగృహానికి వెళ్లి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం రాత్రి పరామర్శించారు. అధికారులందరూ పారదర్శకంగా విధులు నిర్వహించాలని, విధులకు అడ్డుతగిలితే కూటమి ప్రభుత్వం అండగా వుంటుందని ఆమెకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట పలువురు కూటమి నాయకులు ఉన్నారు.

చెరువు ఆక్రమణలు వెంటనే ఖాళీ చేయాలి

మిర్తిపాడులో చెరువు ఆక్రమణదారులతో సీతానగరం ఎంపీడీవో భారతి

సీతానగరం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్తిపాడు గ్రామంలో చెరువు ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎంపీడీవో భారతి ఆక్రమణదారులను చెప్పారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మిర్తిపాడు చెరువు ఆక్రమణదారులతో ఆమె నేరుగా మాట్లాడారు. చెరువును ఆక్రమించుకుని కొందరు దాకాణాలు పెట్టారని, మరికొందరు నివాసముంటున్నారని వీటిని ఖాళీ చేయాలంటూ వారం రోజుల క్రితం నోటీసులు జారీ చేశామన్నారు. చెరువులను ఆక్రమించడం సరైన విధానం కాదన్నారు. చెరువు ఆక్రమణలో నివాసముంటున్న వారికి జనగన్న కాలనీలో స్థలాలు కేటాయించారని, అక్కడికి వెళ్లాలని సూచించారు. అయితే ఎన్నో ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నామని, వాటికి మినహాయింపు ఇవ్వాలని ఆక్రమణదారులు కోరగా, మినహాయింపు ఇవ్వడం కుదరదని, వెంటనే ఖాళీ చేయాలని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో చెరువు ఆక్రమణలను తొలగించి ఎటువంటివంటి నిర్మాణాలు జరపకూడదని, ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్న వారిని బలవంతంగా ఖాళీ చేయించి వారి ఇళ్లను కూలగొట్టారు. అయితే కొన్ని ఆక్రమణలను మాత్రం వదిలేయడమే కాకుండా చెరువు ఆక్రమణలు సరికాదని చెబుతున్న అధికారులు అదే చెరువును ఆక్రమించి ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మించడం పలు విమర్శలకు తావిస్తోంది.

వ్యక్తి అదృశ్యంపై కేసు

రాజమహేంద్రవరం సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం దానవాయిపేట సమీపంలో సూర్యహోటల్‌లో పనిచేసే రామానాయుడు కనిపించడం లేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. విజయనగరానికి చెందిన రామానాయుడు కొంతకాలంగా సూర్యహోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అతడు కనిపించడంలేదు. అయితే హోటల్‌లో పనిచేసుకుని ఇక్కడే వుంటున్నాడని అతడి బంధువులు అనుకుంటున్నారు. ఈ క్రమంలో తండ్రి ఇంటికి రావడంలేదని రాజమహేంద్రవరం వచ్చిన అతడి కుమారుడు పృథ్వి.. రామారావు ఫిబ్రవరిలోనే బయటకు వెళ్లిపోయాడని తెలుసుకున్నాడు. బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీపీపీ మోడ్‌లో కెనాల్ రోడ్డు అభివృద్ధి!



అనపర్తిలో వేమగిరి-కాకినాడ కెనాల్ రోడ్డు

అనపర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మూడో అసెంబ్లీ సమావేశాల్లో కెనాల్ రోడ్డు అభివృద్ధిపై ఎమ్మెల్యే ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లేవనెత్తిన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చింది. ఈ రోడ్డును పీపీపీ మోడ్‌లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఈ లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కెనాల్ రోడ్డును అభివృద్ధి పరిచే క్రమంలో పీపీపీ మోడ్‌లో అభివృద్ధి చేసేందుకు సాంకేతిక, ఆర్థిక సాధ్యతను స్టడీ చేసే నిమిత్తం ప్రాజెక్టు రూపకల్పనకు కన్సల్టెంట్ నియామకానికి ఉత్తర్వులు జారీ అయ్యాయని చెప్పారు. నాలుగు నెలల్లో కన్సల్టెంట్ నివేదిక వస్తుందని, దాని ఆధారంగా పీపీపీ మోడ్‌పై నిర్ణయం వస్తుందన్నారు.దీంతో కెనాల్ రోడ్డు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

ఉండ్రాజవరం, మే 20(ఆంధ్రజ్యోతి): స్థానిక సహజ యోగ ధ్యాన కేంద్రంలో విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. మంగళవారం మోర్త హైస్కూలు తెలుగు ఉపాధ్యాయుడు సీహెచ్‌వీకే ప్రసాద్ విద్యార్థులకు తెలుగు భాష పట్ల అభిరుచి కలిగే విధంగా వేమన, సుమతీ శతకాలలోని పద్యాలు చెప్పారు.

సవరణ

శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘమునకు సంబంధించి 15-05-2025 ఆంధ్రజ్యోతి పేపరు నందు పబ్లిష్ అయినటువంటి టెండరు ప్రకటనలో సంరాడ గ్రామంలో గల భూమి య.18.69 సెంట్లు 2025-2026 నుండి 2027-2028 సం॥ ఐదులు (2025-2025 నుండి 2025-2025)గా ప్రకటన యందు తప్పుగా పడియున్నది. కావున నిజానికి 3సం॥ల కాలమునకు (2025-2026 నుండి 2027-2028)గా చదువుకోగలరు.

మినీ మహానాడు పండుగ

ఇదీ టీడీపీ అంటే.. వానొచ్చినా లెక్కచేయరు.. పార్టీయే ముఖ్యమంటారు.. ఒక్క పిలుపు ఇస్తే వచ్చి వాలిపోతారు.. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు.. జిల్లాలోని కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో మంగళవారం మినీ మహానాడు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు హాజరైన నాయకులు, కార్యకర్తలు జై టీడీపీ... జై జై టీడీపీ నినాదాలతో హోరెత్తించారు..

8



కొవ్వూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆంధ్ర సుగర్స్ జేఎండీ అచ్చిబాబు తదితరులు

మహానాడులో మనోళ్లు!

- నిర్వహణ కమిటీలో నేతలకు ప్రాధాన్యం
- తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా యనమల

రాజమహేంద్రవరం/అమలాపురం, మే 20 (ఆంధ్రజ్యోతి) : అధికార తెలుగుదేశం పార్టీ ఈనెల 27, 28, 29వ తేదీల్లో కడపలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మహానాడుకు సంబంధించిన కమిటీల్లో ఉమ్మడి జిల్లా వారిలో పలువురికి చోటుదక్కింది. మొత్తం 19 కమిటీలను నియమించగా, రెండు కమిటీలకు కన్వీనర్లను ఉమ్మడి జిల్లా నేతలకు అప్పగించడం గమనార్హం. పలు కమిటీల్లో పలువురు ఎమ్మెల్యేలు, నేతలకు ప్రాధాన్యత లభించింది. మాజీ ఆర్థికమంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు తీర్మానాల కమిటీ కన్వీనర్‌గా వ్యవ హరించనున్నారు. సభా స్థలంలో సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ కన్వీనర్‌గా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నియమితులయ్యారు. భోజనాల కమిటీ కోకన్వీనర్‌గా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) నియమితులయ్యారు. రవాణా కమిటీ సభ్యుడిగా గోపాలపురం ఎమ్మెల్యే, బడ్జెట్ ఎస్టిమేట్స్ కమిటీ సభ్యుడు మద్దిపాటి వెంకట్రాజు నియమితులయ్యారు. సభా ప్రాంగణం పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే, సీఎం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్‌కు స్థానం దక్కింది. అలాగే సుందరీకరణ, పరిశుభ్రత కమిటీ సభ్యుడిగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ సాధికారిక సమితి కన్వీనర్ కుడిపూడి సత్తిబాబు, జన సమీకరణ కమిటీ సభ్యుడిగా అమలాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ సభ్యుడు అయితాబత్తుల ఆనందరావును నియమించారు.



యనమల రామకృష్ణుడు



మంత్రి వాసంశెట్టి సుభాష్



చిరు జల్లులు : కాకినాడ నగరంలో కురుస్తున్న వాన

రాజమండ్రిలో..

వానా వరణం!

ఎండా పోయి.. వాన వచ్చే ఢాం ఢాం

- ఉదయం నుంచి వదలని వాన
- వరుణుడి దెబ్బకు భానుడు పరార్
- కాకినాడ జలమయం
- కరపలో అత్యధిక వర్షపాతం
- నేడు, రేపు కూడా వానలు
- ఊపిరిపీల్చుకున్న జనం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఒక పక్క తీవ్ర ఎండలు.. భరించలేని వేడి.. ఉక్కబోతతో అల్లాడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు మంగళవారం కురిసిన భారీ వర్షాలు ఉపశమనం కలిగించాయి. తెల్లవారుజాము నుంచీ రోజంతా అనేకచోట్ల ఓ మోస్తరు నుంచి కుండపోతగా వానపడడంతో జనం ఊపిరిపీల్చుకున్నారు. గడచిన కొన్ని వారాలుగా ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. కాకపోతే ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు దంచికొట్టి సాయంత్రానికి చినుకులు పడుతున్నాయి. దీంతో రోజులో సగం ప్రజలు వేడి, ఉక్కబోతతో నరకం చూస్తున్నారు. అయితే సోమవారం అర్ధరాత్రి ఒక్కసారిగా వాతావరణం మారింది.అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వాన కురిసింది. కొన్నిచోట్ల అయితే మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వానలు పడ్డాయి. దీంతో రోజంతా ఎండమాయమై చల్లని వాతావరణం కొనసాగడంతో జనం ఉపశమనం పొందారు. కాకినాడ నగరంలో భారీ వర్షం పడడంతో మెయిన్ రోడ్డు, మసీదుసెంటర్, లోతట్టు ప్రాంతాలన్నీ మోకాల్లోతు నీటిలో మునిగాయి.అనేక ఇళ్లల్లోకి సైతం నీరు వచ్చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కాకినాడ నగరంలో ఏకంగా 7.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కరప మండలంలో ఏకధాటిగా వానపడడంతో రాష్ట్రంలోనే అత్యధికంగా 6.5 సె.మీ వర్షపాతం నమోదైంది. భారీ వర్షం ధాటికి అనేక రహదారులు మునిగాయి. పంటచేలల్లోకి నీరు వచ్చి చేరింది. కాకినాడ రూరల్‌లో 5.5 సెం.మీ. నమోదైంది. కోనసీమ జిల్లాలోని మండపేటలో అతి తక్కువ వ్యవధిలో 4.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాకినాడ జిల్లా పెదపూడిలో 5, కాజులూరు మండలం ఆర్యవటంలో 4.8, పిఠాపురం, తాళ్లరేవు, రౌతులపూడిలో 2, కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 4.4, కపిలేశ్వరపురంలో 3.6, ఆలమూరు 2.1, ఆత్రేయపురం 1.2, తూర్పుగోదావరి జిల్లా కడియంలో 2, బిక్కవోలు 1.8, అనపర్తి 1.7 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. మరోపక్క రుతు పవనాల ప్రభావంతో బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో నేడు, రేపు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



అబ్బబ్బా ఇదేమి వాన : కరపలో నీట మునిగిన ఎంపీడీవో కార్యాలయం



ఈ వాహనాలకు ఇక పనిలేదు..

రేషన్.. ఎండీయూ వద్దు!

ఇకపై ఎప్పుడు కావాలంటే అప్పుడే రేషన్

- ఇక అక్రమాలకు బ్రేక్
- ఎండీయూ వాహన సేవలు రద్దు
- క్యాబినెట్‌లో నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 1,139 వినియోగం
- రూ.66.19 కోట్లతో కొనుగోలు
- ఇంకా 20 నెలల రుణం బాకీ
- 2,857 దుకాణాల్లో రేషన్

(కాకినాడ/అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఎండీయూ వాహన సేవలకు ప్రభుత్వం మంగళం పాడేసింది.పేదలకు బియ్యం పంపిణీ పేరుతో నాలుగున్నరేళ్ల వైసీపీ సేవలో తరించిన వాహనాలు ఇకపై రద్ద య్యాయి. ఇన్నేళ్లు కొనసాగుతున్న దందాకు ప్రభుత్వం చెక్ పెట్టింది. రేషన్ బియ్యం ఇకపై రేషన్ దుకాణాల్లోనే తెచ్చుకునే వెసులుబాటు కల్పిస్తూ రాష్ట్ర క్యాబినెట్ మంగళవారం నిర్ణయం ప్రకటించింది.

1 నుంచి దుకాణాల వద్దే..

లబ్ధిదారులకు బియ్యం, నిత్యావసరాలు అందించేందుకు గతంలో ఉండే చౌక డిపోల వ్యవస్థను జూన్ 1వ తేదీ నుంచి తిరిగి పునరుద్ధరించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇకపై కార్డుదారులు నేరుగా తమ పరిధి లోని రేషన్ దుకాణాల్లో బియ్యం తీసుకోవచ్చని తెలిపింది. కాకినాడ జిల్లాలో 1,060 రేషన్ దుకాణాల్లో 6.43 లక్షల మంది కార్డుదారులు రేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. కోనసీమ జిల్లాలో 926 రేషన్ దుకాణాల్లో 5.38 లక్షల మంది కార్డుదారులు, తూర్పుగోదావరి జిల్లాలో 871 దుకాణాల ద్వారా 5.65 లక్షల మంది కార్డుదారులకు ప్రభుత్వం నెలకు ఉమ్మడి జిల్లాలో 26 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం పంపిణీ చేయనుంది. ఇకపై 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఏ సమయంలోనైనా లబ్ధిదారుడు చౌక దుకాణం వద్దకు వెళ్లి నేరుగా బియ్యంతో సహా ఇతర నిత్యావసర వస్తువులు పొందే అవకాశం ఉంది. దీనికితోడు దివ్యాంగులు, వృద్ధులకు ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం వినూత్న చర్యలు చేపట్టనుంది. కాగా రాష్ట్రవ్యాప్తంగా చౌకడిపో డీలర్లు చేస్తున్న ఉద్యమాల నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల వారు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలకు బ్రేక్ వేశారు..

నెలలో తమకు కావాల్సిన సమయంలో కార్డుదారులు రేషన్‌దుకాణానికి వెళ్లి తెచ్చుకునే అవకాశం అమలవుతుండగా..గత వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడిచింది. కార్డుదారులకు నరకం చూపించింది. తొలుత ఇంటింటికి బియ్యం పంపిణీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆనక మాట మార్చేసింది. ఒక కాలనీకి వెళ్లి ఈ ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనం సైరన్‌తో ప్రదర్శిస్తే గంటల తరబడి ఆ కాలనీవాసులు వాహనం ఎదుట నిలబడి బియ్యం తెచ్చుకోవాల్సిన పరిస్థితికి తెచ్చింది. ఆ రోజు వాహనం వద్దకు వెళ్లకపోతే ఆ నెల బియ్యం పోయినట్టే.ఈ వాహనం పేరుతో సదరు ఆపరేటర్లు కార్డుదారులపై రుబాబు చేసేవారు. బియ్యం ఇచ్చినట్టే ఇచ్చి అక్కడే తిరిగి కొనుగోలు చేసేవారు.ఆ బియ్యం తిరిగి వైసీపీ నేతల కనుసన్నల్లో నడిచే రేషన్ మాఫియాకు ఈ వాహనాలు తరలించేవి.ఇదే విషయాన్ని మంగళవారం నాటి క్యాబినెట్ సమావేశంలో మంత్రులు ప్రస్తావించారు.దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఈ ఎం డీయూ వాహనాలను రద్దు చేసింది.

కోట్లలో దుర్వినియోగం..

గత వైసీపీ ప్రభుత్వం సొంత ప్రచారానికి రేషన్‌దుకాణాలను నిర్వీర్యం చేసి ఈ ఎండీయూ వాహనాలను రుద్దింది. ఒక్కో వాహనాన్ని రూ.5.81 లక్షల చొప్పున బ్యాంకు రుణంపై కొనుగోలు చేసి ఆపరేటర్లకు అందించింది. మొత్తం 72 నెలల వాయిదాపై బ్యాంకు నుంచి 2021 ఫిబ్రవరిలో రుణం తీసుకుంది.కాకినాడ జిల్లాలో 420, తూర్పుగోదావరి జిల్లాలో 364, కోనసీమ జిల్లాలో 355 వాహనాలను బ్యాంకు నుంచి రూ.66.19 కోట్ల రుణం ద్వారా కొనుగోలు చేసింది.ఇప్పటికీ ఈ రుణాన్ని ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తోంది.ఇంకా ఇరవై నెలల బాకీ బ్యాంకుల్లో ఉంది. ఇప్పుడు ఈ వాహనాలను రద్దు చేసిన నేపథ్యంలో రూ.6.83 కోట్లు అప్పు తీర్చాల్సి ఉంది. ఈ ఎండీయూ వాహనాలను నడుపుతున్న వ్యక్తుల ఉపాధికి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం వారికి ఆ వాహనాలను ఉచితంగానే అప్పగించడం ద్వారా ఎండీయూ వాహనాల నిర్వాహకులకు ఎటువంటి ఇబ్బందులు ఉండబోవనేది ప్రభుత్వం ఆలోచనగా ఉంది.

ఆంధ్రజ్యోతి కథనం.. ఎంపీడీవో తొలగింపు

ఇన్‌చార్జి ఎండీవోగా ఆర్మ్‌స్ట్రాంగ్

రాజమహేంద్రవరం రూరల్ మే 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కథనంతో కదలిక వచ్చింది..ఎంపీడీవో స్థాయి అధికారిని తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావు పంచాయతీల సీఎఫ్ఎంఎస్ బిల్లుల విషయంలో అనధికారికంగా వ్యవహరించినట్టు ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు విచారణకు ఆదేశించిన కలెక్టర్ నిజమని తేలడంతో శ్రీనివాసరావును విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలో ఈయన విధులు అవసరం లేదంటూ కమిషనర్ పీఆర్ఆర్డీకి తదుపరి చర్యల నిమిత్తం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రూరల్ మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా కె.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను నియమిస్తూ కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు.

డబ్బులకు బెదిరిస్తే సమాచారం ఇవ్వండి

డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్స్, స్కానింగ్ సెంటర్లకు మీనాక్షి అనే పేరుతో 70326 72067 మొబైల్ నెంబరు నుంచి కాల్ చేసి ప్రభుత్వ అధికారిగా తనను పరిచయం చేసుకుని, డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు బెదిరిస్తున్నట్టు తమ కార్యాలయానికి సమాచారం అందిందని అలాంటి కాల్స్‌తో తమ కార్యాలయానికి ఎలాంటి సంబంధంలేదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనధికార బెదిరింపు కాల్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత, ఆర్థిక, ఇన్‌స్టిట్యూషన్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. నకిలీ కాల్స్ వస్తే వెంటనే డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం సెల్ 8125567830 నెంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వం మారింది.. తెలుగుకు వెలుగొచ్చింది.. రాజమ హేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. విశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ చేసిన ప్రతిపాదనను కేబినెట్ ఆమోదించింది. నోటిఫికేషన్ జారీకి ఆమోదం తెలిపింది. రాజమహేంద్రవరంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గోదావరి ప్రజల కోరిక తీరింది.



తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ప్రధాన ద్వారం

తెలుగు..వెలుగు!

- పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీకి ప్రాణం
- సీఎం చొరవతో కేబినెట్ ఆమోదం
- రాజమండ్రిలో ప్రధాన కార్యాలయం
- 1986లో పీఠానికి ఎన్టీఆర్ శంకుస్థాపన
- గోదావరి జిల్లాల్లో హర్షాతిరేకాలు
- రాష్ట్ర విభజన తర్వాత తొలి వర్సిటీ
- 55 ఎకరాలు ఇస్తే మిగిలింది 20 ఎకరాలే

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం ఉనికి కోల్పోయింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విశ్వవిద్యాలయం పేరు మార్పుతోపాటు, ఏపీలోని తెలుగు వర్సిటీకి సంబంధించిన మూడు పీఠాల నిర్వహణ అధ్వానమైంది. 2016 వరకూ ఇక్కడ అన్ని కోర్సులు జరిగాయి. బొమ్మూరులోని తెలుగు పీఠంలో 2024- 25 నుంచి మొత్తం అడ్మిషన్లు ఆగిపోయాయి. ఈ నెల 3వ తేదీన ఎంఎ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తవడంతో ఈపీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది.దీంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి, తెలుగు కళలకు పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం చిగురించింది. ఇక్కడ ఉద్యోగులకు జీతాలు రాని పరిస్థితి ఉంది. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఓఎస్డీని నియమించి జీతాలు ఇస్తున్నారు.

1986లో ఆరంభించిన ఎన్టీఆర్..

తెలుగు సాంస్కృతిక, సాహిత్య వైభవం విరజిల్లిన ప్రాంతం రాజమహేంద్రవరం..ఈ నేపథ్యంలో 1986 ఏప్రిల్‌లో తెలు గుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ తెలుగు భాషను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయంలో భాగంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటుకు స్వయంగా శంకుస్థాపన చేశారు.శ్రీశైలం, కూచిపూడిలలో కూడా తెలుగు విశ్వవిద్యాలయ పీఠాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరంలో బొమ్మూరు కొండ మీద సుమారు 55 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. అడ్మినిస్ట్రేషన్ భవనం, తరగతుల నిర్వహణ, హాస్టల్, హాస్టల్ మెస్, నాలుగు క్వార్టర్స్ నిర్మించారు. బొమ్మూరు తెలుగు పీఠం ఓ వెలుగు వెలిగింది. విభజన నేపథ్యంలో పీఠం శిథిలస్థితికి చేరింది. క్యాబినెట్ నిర్ణయంతో మళ్లీ జీవం పోసుకుని ఇక్కడ తెలుగు విశ్వవిద్యాలయంగా విరాజిల్లనుంది. తొలి పీఠాధిపతిగా కొత్తపల్లి వీరభద్రరావు నియ మితులయ్యారు. ఎండ్లూరి సుధాకర్ హయాంలో రాష్ట్ర విభజన రావడంతో ఇది పూర్తిగా దెబ్బతింది. ఇక్కడ తెలుగు ఎంఎ,ఎంఫిల్, పీహెచ్‌డీ తరగతులు నిర్వ హించేవారు. మొదట తరగతికి 25 మంది విద్యార్థులతో ఇది మొదలైంది. తర్వాత 30కి పెరిగింది. ఆరుగురు టీచింగ్ స్టాఫ్, 12 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ ఉండేవారు. ఇక్కడ ప్రముఖ ప్రవచనకారుడు గరికిపాటి నరసింహారావు మొదటి ఎంఫిల్ పట్టాపొందారు.ప్రముఖకవి అద్దేపల్లి రామ్మోహనరావు, విమర్శ కుడు ద్వానాశాస్త్రి ఇక్కడ పీహెచ్‌డీ చేశారు. మారిషస్ దేశం నుంచి వచ్చి ఇద్దరు ఇక్కడ పీహెచ్‌డీలు చేశారు.ఇక్కడ 300 మంది పీహెచ్‌డీలు చేయగా, సుమారు 450 మంది ఎంఫిల్ చేశారు. సుమారు 550 మంది తెలుగు ఎంఎ చేశారు. కాలువ మల్లయ్య వంటి ప్రముఖ కథా రచయితలు ఇక్కడ గోష్ఠుల్లో పాల్గొనడం గమనార్హం. ఇక్కడ 14 మంది ఉద్యోగులు మాత్రం ఉన్నారు. భవనాలు సుమారుగా శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల భూమి మిగిలింది. 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం ఉంది.



చిట్టడవిలా ప్రధాన భవనం ఆవరణ

కేబినెట్‌లో ఏం జరిగిందంటే..

అమరావతిలో మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చట్టం 1985 లోని సెక్షన్ 3(2) ప్రకారం రాజమహేంద్రవరంలో ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ఏపీలో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు ప్రారంభానికి వీలు కల్పించింది. ఏపీలో ఉన్న మూడు సాహిత్య పీఠాలను నిర్వహణకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పనిచేస్తుందని కేబినెట్ విశదీకరించింది. రాజమహేంద్రవరంలో తెలుగు వర్సిటీ ఏర్పాటుపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు.



చెట్లతో మూసుకుపోయిన ప్రధాన రహదారి



కొవ్వూరు రేషన్ డిపో వద్ద లబ్ధిదారులను ప్రశ్నిస్తున్న కలెక్టర్

రేషన్ పంపిణీపై నిఘా ఉండాలి

రేషన్ దుకాణాల పరిశీలనలో కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపంపిణీ వ్యవస్థ పనితీరును క్షేత్రస్థాయిలో అధికారులు తనిఖీచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.చాగల్లు ఎంఎల్ఎస్ పాయింటుతో పాటు కొవ్వూరులోని రేషన్ దుకాణాలను మంగళవారం తనిఖీ చేశారు. చాగల్లు మండలం ఊనగట్ల స్టాక్ పాయింటులో స్టాక్‌ను, రిజిష్టర్ల నిర్వహణ పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న పౌరసేవలకు సంబంధించి ఆయా వ్యవస్థల పనితీరుపై జిల్లాస్థాయి అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఊనగట్ల స్టాక్ పాయింటు పరిశీలించి నివేదిక అందించాలని ఆర్డీవోను ఆదేశించారు. కొవ్వూరులో రేషన్ షాపుల వద్ద వినియోగదారులతో మాట్లాడారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తనిఖీచేసిన స్టాక్ వివరాలను తెలిపారు.వారి వెంట తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సీఎస్‌డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు యోగాంధ్రప్రదేశ్

రాజమహేంద్రవరం సిటీ, మే 20(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గౌతమి ఘాట్‌లో బుధవారం ఉదయం 6 గంటలకు యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. యోగాంధ్రప్రదేశ్ కార్యక్రమంపై మంగళవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డీవోలు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, పురపాలక కమిషనర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వన్ నేషన్-వన్ హెల్త్ నినాదంతో ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగాపై పోటీలు నిర్వహించాలని సూచించారు.జూన్ 21న విశాఖలో జరిగే కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరవుతారన్నారు.సమావేశంలో జేసీ చిన్నరాముడు ,డీఆర్‌వో సీతారామమూర్తి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరిని మంగళవారం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కుటుంబంతో మర్యాదపూర్వకంగా కలిశారు. - కొవ్వూరు





కొవ్వూరు : ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే ముప్పిడి

కష్టపడిన ప్రతిఒక్కరికీ..
సముచిత స్థానం

- టీడీపీ నేత, ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)
- కొవ్వూరు, వేలివెన్ను, ద్వారకాతిరుమలలో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు
- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హాజరైన తెలుగు తమ్ముళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు

కొవ్వూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలు, నాయకులకు టీడీపీలో ఎల్లప్పుడూ సముచితస్థానం ఉంటుందని ఆ పార్టీ నేత, ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు అన్నారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో కొవ్వూరు నియోజకవర్గ మినీ మహానాడు నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి అచ్యుతరామయ్య (అచ్చిబాబు) పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కొవ్వూ రు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతికి సభ నివాళులర్పించింది. అచ్చిబాబు మాట్లాడుతూ సినిమా రంగం నుంచి ప్రజారంగంలోకి వచ్చి ఎంతో దూరదృష్టితో ఎన్టీఆర్ పార్టీని స్థాపించారన్నారు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే జాతీయ పార్టీని ఢీకొట్టి అధికారం చేపట్టారన్నారు. పార్టీకి కొత్తరక్తం కావాలన్నారు. గతంలో ఎన్నికలైన తరువాత మరలా 5 సంవత్సరాల వరకు రాజకీయాలకు దూరంగా ఉండేవాడిని, ఈసారి అలా కాదు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను బట్టి అందరికీ అందుబాటులో ఉంటున్నానన్నారు. వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వాన్ని వేలెత్తి చూపడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలు గువారి ఆత్మగౌరవం కోసం స్థాపించిన పార్టీ టీడీపీ అన్నారు. వైసీపీ పాలనలో సైకో ముఖ్యమంత్రి పాలనలో రాష్ట్ర అభివృద్ధి 15 సంవత్సరాలు వెనకబడిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. అలాగే క్లస్టర్, యూనిట్, గ్రామకమిటీలు, మండల కమిటీల నియామకాలు ఈనెల 25వ తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు మధ్య అభిప్రా య భేదాలు ఉన్నట్టయితే సామరస్యంగా మా ట్లాడి పరిష్కరించుకోవాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్ మాట్లాడుతూ టీడీపీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా.. లెక్కచేయకుండా వచ్చిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం నియోజకవర్గానికి సంబంధించి పలుఅంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని, కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో కొవిడ్ ముందు ఆగే అన్ని రైళ్లకు తిరిగి హాల్ట్ కల్పించాలని, మున్సిపల్ డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలని, కొవ్వూరు పట్టణంలోకి అన్ని డిపోల ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, టిడ్కోగృహాలకు పెండింగ్ బిల్లులు మంజూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, కొవ్వూరు, తాళ్లపూడి ఏటిగట్టు రోడ్డు వెడల్పు చేయాలని, ఎత్తిపోతల పథకాల కాలువలు ఆధునీకరించాలని, కుమారదేవం పంపింగ్ స్కీమ్‌కు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, రాబోయే పుష్కరాలకు నూతన స్నానఘట్టాల నిర్మాణంతో పాటు ఉన్న స్నానఘట్టాలను విస్తరించాలని, యానాదులకు వారి సొంతస్థలాల్లో ఇళ్లు నిర్మించాలని, కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టాలని, చాగల్లు ఆసుపత్రిని 30 పడకలుగా విస్తరించాలని, తదితర వాటిపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీసభ్యుడు కంటమణి రామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, పట్టణ, మండల అధ్యక్షులు దాయన రామకృష్ణ, వట్టికూటి వెంకటేశ్వరరావు, నామాన పరమేశ్వరరావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వేమగిరి వెంకట్రావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ చింతపల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో మార్పులు తెచ్చిన ఘనత ఎన్టీఆర్‌దే

ఉండ్రాజవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకువచ్చిన ఘనత స్వర్గీయ ఎన్టీ రామారావుకే దక్కిందని మాజీ ఎమ్మెల్యే, నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. మంగళవారం వేలివెన్నులో నిడదవోలు నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చరిత్ర సృష్టించిన మహనీయుడు అన్న ఎన్టీఆర్ అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ అనంతరం సీఎం చంద్రబాబు పార్టీని ముందుకు తీసుకువెళుతూ పార్టీకి మంచి గుర్తింపు తెచ్చారన్నారు. నియోజవర్గంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింహాద్రి రామకృష్ణ, రవివర్మ, కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, తిరుపతి సత్యనారాయణ, సలాది కృష్ణమూర్తి, బూరుగుపల్లి శ్రీనివాసరావు, అత్తిలి సత్యనారాయణ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వేలివెన్నుకు తెలుగు తమ్ముళ్ల పయనం

నిడదవోలు: నిడదవోలు పట్టణం, మండలం నుంచి ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో మంగళవారం జరిగిన టీడీపీ మినీ మహానాడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, తన్నీడి బోసు, తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు : మినీ మహానాడు సభకు హాజరైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అధికారంలో ఉన్నది అభివృద్ధి చేయడానికే : ఎమ్మెల్యే

ద్వారకాతిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉన్నది ఆధిపత్యం చెలాయించడానికి కాదని, అభివృద్ధికి వినియోగించడానికని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు స్పష్టం చేశారు. గోపాలపురం నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం ద్వారకాతిరుమలలోని వి.కన్వెన్షన్‌హాల్లో మంగళవారం అట్టహాసంగా జరిగింది. ముందుగా నియోజకవర్గ టీడీపీ నేతలు, కార్యకర్తలు తిమ్మాపురం పార్టీ కార్యాలయం నుంచి భారీ మోటార్ సైకిల్ ర్యాలీగా మినీ మహానాడు ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే వెంకట్రాజు ముఖ్యఅతిథిగా హాజరుకాగా పలువురు వక్తలు 43 ఏళ్ల పార్టీ ఘన చరిత్రను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే ముందుగా స్టేజీపై నుంచి కార్యకర్తలకు మోకాళ్లపై కూర్చుని నమస్కారం చేసి సభను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు విశేష కృషి చేశారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఇలా అన్నివర్గాలకు పసుపు జెండా అండగా నిలిచిందన్నారు. కొన్నాళ్లు ఒక నియంత పరిపాలనను చవిచూశామని, గత ప్రభుత్వ పాలన రాక్షసపాలనను గుర్తు చేసిందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాన్ని చంద్రబాబు గాడిలో పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తుంటే, లోకేశ్ పార్టీ నేతల్లో కార్యకర్తల్లో చైతన్యాన్ని నింపుతున్నారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదినెలల కాలంలో ఎటువంటి విశ్రాంతి లేకుండా గ్రామదర్శిని వంటి కార్యక్రమాలు జరిపి సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేసినట్టు తెలిపారు. ఈనెల 29 నుంచి కడపలో జరిగే మహానాడుకు నియోజకవర్గం నుంచి టీడీపీ శేణులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పోలిన శ్రీనివాసరావు, లంకా సత్యనారాయణ, పాకలపాటి గాంధీ, నాదెండ్ల సురేంద్రనాథ్ చౌదరి, మద్రాస్ రాము, జడ్పీటీసీ శామ్యూల్, పలువురు నియోజకవర్గ ముఖ్యనేతలు పాల్గొన్నారు.

నల్లజర్ల నుంచి భారీగా ..

నల్లజర్ల: గోపాలపురం నియోజకవర్గ పరిధిలో ద్వారకాతిరుమలలో ఏర్పాటు చేసిన మినీ మహానాడు కార్యక్రమానికి మండలం నుంచి నాయకులు కార్యకర్తలు ర్యాలీగా నల్లజర్ల పార్టీ కార్యాలయం నుంచి తరలి వెళ్లారు. అనంతపల్లి నుంచి మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ ఆధ్వర్యంలో పోతవరం నుంచి పసుమర్తి రతీష్ ఏలేటి జేడీ, ప్రకాశరావుపాలెంలో యద్దనపూడి బ్రహ్మరాజు, చీపురుగూడెంలో చెల్లు పెద్దరామన్న, కూసంపూడిలో బుజ్జి, కవులూరులో బేతిన సత్యనారాయణ, దూబచర్లలో కూచిపూడి ఉదయ భాస్కరరావు, ఆవపాడులో షేక్‌మీరా, తెలికిచర్లలో సుంకర సుబ్బారావు,నల్లజర్లలో కండెపు వెంకట రత్నం, గంటా శ్రీను, సుభద్రపాలెం ఏలేటి సత్యనారాయణ (జేడీ) సమక్షంలో నేతలు, కార్యకర్తలు వెళ్లారు.

ద్వారకాతిరుమల తరలిన నేతలు

గోపాలపురం: ద్వారకాతిరుమలలోని వీ. కన్వెన్షన్ ఫంక్షన్‌హాలులో గోపాలపురం నియోజకవర్గానికి సంబంధించి మినీ మహానాడును ఎమ్మెల్యే మద్దిపాటి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ పుట్టిన రోజు సందర్భంగా ఎమ్మెల్యే కేకును కోసి, స్వీట్లను అభిమానులకు పంచి పెట్టారు.



ఉండ్రాజవరం : వేలివెన్నులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు



ద్వారకాతిరుమల: ర్యాలీగా మహానాడు ప్రాంగణానికి వెళుతున్న ఎమ్మెల్యే, నియోజకవర్గ నేతలు



నిడదవోలు : వేలివెన్ను సభకు ర్యాలీగా బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు


కొవ్వూరులో ముసురు



కొవ్వూరు విజయవిహార్ సెంటర్‌లో వర్షం కురుస్తున్న దృశ్యం

కొవ్వూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కారణంగా కొవ్వూరు పట్టణం, మండలంలో మంగళవారం ఉదయం నుంచి ముసురు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో ప్రజలంతా ఇంటికే పరిమితమయ్యారు. దీంతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలలో వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం నుంచి వాతావరణం పొడిగా ఉండడంతో ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డి

దేవరపల్లి, మే20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉపాధి హామీ కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కృష్ణంపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధి హామీ కూలీలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించటం జరుగుతుందన్నారు. అలాగే వేసవిలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అందజేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎవరైనా రైతులు ఉపాధి హామీ కూలీలతో పనిచేయించుకోవడానికి సిద్ధంగా ఉంటే పారం పనులు చేసే వారందరికీ ఎస్టిమేట్ వేసి పని ఇవ్వడం జరుగుతుందన్నారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

ఉండ్రాజవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వడ్లూరు సర్పంచ్ ఆర్. తేజశ్రీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

రేషన్ షాపులు తనిఖీ చేయాలి : కలెక్టర్



ఊనగట్లలో ఎంఎస్ఎల్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



నల్లజర్లలో షాపు నెంబర్ 34ను తనిఖీ చేస్తున్న అధికారులు



గోపాలపురంలో రికార్డులు పరిశీలిస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి

చాగల్లు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊనగట్ల ఎంఎస్ఎల్ పాయింట్‌ను కలెక్టర్ పి. ప్రశాంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. దీనిలో భాగంగా స్టాక్ వివరాలను తెలుసుకుని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పౌరసేవలు అందించే క్రమంలో క్షేత్రస్థాయిలో జిల్లా అధికారులు తనిఖీలు నిర్వహించాల్సి ఉందన్నారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం ఉందో లేదో పరిశీలించి నివేదిక అందించాలని ఆర్డీవో రాణీసుస్మితను ఆదేశించారు. తహశీల్దార్ ఎం. మెరికమ్మ, తదితరులు ఉన్నారు.

నల్లజర్ల: రేషన్‌షాపులు, గ్యాస్ ఏజెన్సీల్లో సరుకుల్లో వ్యత్యాస్యం ఉంటే కఠినచర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై ఏఎస్‌వో నాగాంజనేయులు హెచ్చరించారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు కోర్డినేషన్ పై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భ ఏఎస్‌వో మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా యాప్ ఏర్పాటు చేసి రేషన్ షాపులపై నిరంతర తనిఖీ చేస్తుందని, డీలర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎండీయూ ఆపరేటర్లు ప్రతి నెలా 1వ తేదీ నుంచి ఉదయం ఆరు గంటలకు ప్రజలకు నిత్యవసర సరుకులు అందించాలని కోరారు. అనంతరం సీతారామ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేశారు. ఈయనతో సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, వీఆర్వో మూర్తి, ఏఆర్ఏ సర్దార్ , తదితరులు ఉన్నారు.

గోపాలపురం: పౌరసరఫరాల శాఖలో ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న నిత్యవసర సరుకుల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోపాలపురం ఏఎంసీ కార్యాలయ ఆవరణలో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. స్టాక్,రికార్డులు పరిశీలించి సంతృప్తివ్యక్తం చేశారు. అనంతరం మాటాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గోదామును పరిశీలించటం జరిగిందన్నారు. ఆయన వెంట గోదాము ఇన్‌చార్జి ఎన్.వీరభద్రం, సివిల్ సప్లై డీటీ దివాకర్, తదితరులు ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి : సీఐటీయూ



తాళ్లపూడిలో సీఐటీయూ సభ్యులతో ఉన్న సుందర్‌బాబు

తాళ్లపూడి, మే 20 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 9న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సుందర్‌బాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం తాళ్లపూడిలో యూనియన్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల మెడకు ఉరితాడులైన నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దుచేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలన్నారు. అలాగే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేసి రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్‌చేశారు. ఈ సమ్మెలో దేశ వ్యాప్తంగా 11 జాతీయ కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయన్నారు. సుంకర వెంకటేశ్వరరావు, వల్లేపల్లి నరసింహమూర్తి, రెడ్డిరాజు, కమిడి గణేష్, అక్కాబత్తుల శంకరం, చెరుకూరి ప్రకాశం, ఎస్‌కే బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: దేశ వ్యాప్తంగా జూలై 9వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కనీస వేతనం రూ. 30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బొచ్చా ముద్దుకృష్ణ, బందారు రాంబాబు, బొచ్చా దుర్గాప్రసాద్, బంగారు శ్రీహరి, తూరుగోపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

తీపర్రులో ఆలయ భూముల వేలం



తీపర్రులో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

పెరవలి, మే 20(ఆంధ్రజ్యోతి): తీపర్రులో రెండు ఆలయాలు, ఒక ధర్మసత్రానికి సంబంధించి భూముల కౌలు కోసం మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి సంబంధించి 13 ఎకరాల 23 సెంట్లు వ్యవసాయ భూమి ఏడు ప్రతులుగా వేలం వేయగా, మొత్తం ఏడు లక్షల ఐదు వేలకు వేలం పాటను రైతులు పా డుకున్నారు. ఇది గతంలో ఐదు లక్షల 69 వేల 300 ఉండేది. ప్రస్తుతం వేలంపాట ద్వారా 1,35,700 ఎక్కువ ఆదాయం సమకూరింది. అలాగే ఈడ్పుగంటి రత్తమ్మ ధర్మసత్రంకు సంబంధించిన 88 సెంట్ల భూమి గతంలో 29 వేలు ఉండగా, ప్రస్తుతం 31 వేలకు పాడారు. దీంతో రెండు వేలు ఎక్కువ ఆదాయం లభించింది. అదే విధంగా రాజరాజ నరేంద్ర స్వామి ఆలయానికి సంబంధించి 11 ఎకరాల 12 సెంట్లు భూమి మూడు ప్రతులుగా వేలం వేయగా, రూ. మూడు లక్షల 28 వేలకు రైతులు పాడుకున్నారు. గతంలో ఇది రూ. మూడు లక్షల 22 వేలుగా ఉండేది. వేలం పాట ద్వారా రూ. ఆరువేలు ఎక్కువ ఆదాయం సమకూరింది. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈవో ఎంచి రామయ్య వేలం పాట నిర్వహించారు. ఆయనకు జూనియర్ అసిస్టెంట్ వైఎం బాలాజీ సహకరించారు. గ్రామ ప్రముఖులు కంటిపూడి సూర్యనారాయణ సింహాద్రి సత్యనారాయణ మొగల్లపు సీతారామ్ భోగవిల చంటిబాబు, బలుసు రంగారావు, నందమూరి నారాయణరావు పాల్గొన్నారు. కాకరపర్రు, ఉసులుమర్రు, తాడిపర్రు, కాకరపర్రు, వెలగదుర్రు, తీపర్రుకు చెందిన రైతులు వేలం పాటలో పాల్గొన్నారు.

రాజేష్ మృతి తీరని లోటు

చాగల్లు, మే 20 (ఆంధ్రజ్యోతి): దారవరానికి చెందిన గాడి రాజేష్ మృతి తీరని లోటని, ప్రభుత్వం ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని ఎంఆర్‌పీఎస్ నాయకుడు గాలింకి రాము అన్నారు. విజ్జేశ్వరం గోదావరి వాగు వద్ద ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరిలో పడి మరణించిన రాజేష్ కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే కుటుంబ భారం మోస్తున్నాడన్నారు. ఈయనతోపాటు ఎంఆర్‌పీఎస్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

ఆకు తీగలను తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉన్న ఆకు తీగలను తొలగించిన దృశ్యం

నల్లజర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంలో 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో మంగళవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. మంగళవారం ఉదయమే విడియాల వెంకటేశ్వరరావు పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టుకున్న ఆకు తీగలను తొలగించారు. ఏఈ రమణ ఆదేశాల మేరకు లైన్‌మెన్ వెంకన్నబాబు చర్యలు తీసుకున్నారు. సమస్యను పరిష్కరించిన 'ఆంధ్రజ్యోతి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

కోళ్ల వ్యర్థాల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఎక్స్‌కవేటర్‌తో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

నల్లజర్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): ముసుళ్లకుంట హైవే సర్వీస్ రోడ్డు పక్కనే కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారని, దీంతో ఆ మార్గంలో వెళ్లే జనాలు ముక్కుమూసుకుంటున్నారని ఈనెల 18న 'రోడ్ల పక్కనే కోళ్ల వ్యర్థాలు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై ముసుళ్ళకుంట సర్పంచ్ నందమూరి శారదాదేవి స్పందించి మంగళవారం ఎక్స్‌కవేటర్ సాయంతో వ్యర్థాలను తొలగించారు.

వేసవి శిక్షణ తరగతులు

ఉండ్రాజవరం, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సహజ యోగ ధ్యాన కేంద్రంలోని విద్యార్థులకు మంగళవారం మోర్త హైస్కూల్‌కు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు చెరుకూరి వెంకటకృష్ణప్రసాద్ తెలుగు భాషపై అభిరుచి కలిగే విధంగా వేమన, సుమతీ శతకాలలోని పద్యాల గురించి చెప్పారు. సెంటర్ కోఆర్డినేటర్ బి. సాయిశేఖర్, ఉమాశంకర్, ఆకెళ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.